

అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 37(మంగళవారం)
కనిష్ఠం : 29




బీచ్‌లో యోగాసనాలు వేస్తున్న జేసీ నిషాంతి, రాజోలు ఎమ్మెల్యే వరప్రసాద్, ఆర్డీవో మాధవి, డీఆర్వో రాజకుమారి

సాగర..యోగా!

- అంతర్వేది సాగరతీరంలో యోగాంధ్ర-2025 కార్యక్రమం
- భారీగా తరలివచ్చిన ప్రజలు
- 4వేల మందితో యోగాసనాలు

7





అంతర్వేది బీచ్‌లో యోగాంధ్రలో భాగంగా సాగరతీరంలో యోగాసనాలు వేస్తున్న ప్రజలు, అధికారులు

ఉవ్వెత్తున ఎగసిపడుతున్న సముద్రపు కెరటాల తీరంలో సూర్యుడి కిరణాల మధ్య శరీరం, మనసు ధ్యాన శ్వాసల సమన్వయంతో ఒక్కటైన పవిత్ర క్షణాలు.. ప్రకృతితో పరమాత్మను అనుసంధానించే యోగ సాధనలకు అంతర్వేది సముద్రతీరం నీలిరంగు కాంతులతో యోగాకు వేదికగా నిలిచింది. అంతర్వేది బీచ్‌లో యోగాంధ్ర-2025 పేరిట 4వేల మందితో యోగా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. సముద్ర తీరంలో ఎగసిపడుతున్న కెరటాల నడుమ 4వేలమంది సామూహిక యోగాసనాలు వేశారు. సూర్యభగవానుడి నుంచి సూర్యకిరణాలు ప్రసరిస్తుండగా అంతమంది యోగాసనాలు వేసిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

-ఆంధ్రజ్యోతి, అంతర్వేది

ఓటు ఏం చేయగలదు..?
ఓటు వజ్రాయుధం ఎలా?
ఓటుతో భవిష్యత్ ఎలా మారుతోంది?
ఓటుకు ఉన్న సత్తా ఏమిటి?
ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానమే 2024..
ఓటుకు నోటేశారు..
భయపెట్టి నోటికి తాళాలు వేసేశారు..
మరో 30 ఏళ్లు అధికారం మాదే
అంటూ బింకాలు పలికారు..
ఓటరు ఊరుకున్నాడు.. ఊరుకున్నాడు..
ఐదేళ్లూ చూశాడు.. చూశాడు..
2024లో అతని రోజు రానే వచ్చింది..
ఓటు శాసించింది..
మాకేంటి అని బింకాలు పలికిన నాయకులను మూలన కూర్చోపెట్టింది.. మరో 30 ఏళ్లు మాదేనంటూ విర్రవీగిన నాయకులను ఇళ్లకే పరిమితం చేసేసింది.. రాక్షస పాలనకు ఓటు చరమగీతం పాడింది. గోదారంతా ఫ్యాన్‌ను ఊడ్చి కొట్టారు..సరిగ్గా ఇదే రోజు గతేడాది జూన్ 4న కూటమికి పట్టం కట్టారు. ప్రస్తుతం చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధిని చూస్తున్నారు..ఆ రోజులు.. ఏడాదిలో ఈ రోజులు బేరీజు వేసుకుంటూ హమ్మయ్య అంటూ గుండెలపై చేయి వేసుకుని హాయిగా నిద్రపోతున్నారు..

- (కాకినాడ,ఆంధ్రజ్యోతి)



ఓటర్లు..బారులు : రాజమహేంద్రవరంలో 2024, మే 13న ఓటర్ల భారీ క్యూ

ఓ..టర్న్!

ఐదేళ్లు విసిగి.. ఫ్యాన్ అంతం చూశారు!

- వైసీపీ అరాచకపాలన అంతమై నేటికి ఏడాది
- ఐదేళ్లలో ప్రజలను పీడించేసిన జగన్ సర్కారు
- విసుగెత్తి, విరక్తితో ఫ్యాన్‌ను ముక్కలు చేసిన ఓటర్లు
- ఉమ్మడి జిల్లాలో ఒక్క సీటు దక్కని వైసీపీ
- నాడు కూటమికి జైకొట్టిన ప్రజానీకం

ఆ ఐదేళ్లు తల్చుకుంటేనే వణుకు.. అధికారం ముసుగులో అంతటా అరాచకం..పేట్రేగిపోయిన విచ్చలవిడితనం.. రాత్రి8 గంటలు దాటిన తరువాత బయలకు వెళ్లాలంటేనే బ్లేడ్ బ్యాచ్‌లతో భయం భయం.ఓట్లేసి గెలిపించి నందుకు ప్రజలను పీడించేయడం.. సహజవనరుల లూటీ.. భూ కబ్జాలు..బెదిరింపులు.. ప్రశ్నిస్తే కేసులు..ప్రజల సొంత ఆస్తులపై సైతం కన్నేసి కాటే యడం...డ్రైవర్‌ను హత్య చేసి మృత దేహాన్ని ఇంటికే డోర్ డెలివరీ చేయడం.. పోలీసులే నిందితుడికి రక్షణ ఇవ్వడం..ఎక్కడ చూసినా రోడ్లన్నీ గోతులు..వాటిపై ప్రయా ణిస్తే ప్రాణం హరీ అనే పరిస్థితులు.. వైసీపీ ఐదేళ్ల పాలన ప్రజ లకు ప్రత్యక్ష నరకం చూపించింది. వీటిన్నింటిపై విసిగెత్తిపోయిన ప్రజలు సరిగ్గా ఏడాది కిందట ఓటుతో కసితీరా వైసీపీని వేటాడారు. ఓట్లతో దండయాత్ర చేసి వైసీపీ పీడను విరగడ చేశారు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఫ్యాన్‌ను ముక్కముక్కలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని బతికిస్తూ కూట మికి పట్టం కట్టారు. మొత్తం 21 సీట్లకు 21 చోట్లా గెలిపించి బ్రహ్మరథం పట్టారు.అదే సమ యంలో తొలిసారి జనసేన సత్తా చాటింది. పోటీచేసిన అన్నిచోట్లా విజయ దుందుభి మోగించింది.

ఆ ఐదేళ్లూ ఎంత విరగబాటో...

2019 మే 23...ఒక్క ఛాన్స్ అంటూ రకరకాల మోసపూరిత హామీలతో జగన్ జనాన్ని వంచించి గెలిచిన రోజు.. అదే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు పెనుశాపంగా మారుతుందని ఎవరూ ఊహించలేదు.ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వం అరాచకం సృష్టించింది. ఆ పార్టీ నేతలు..ఎమ్మెల్యేలు...సీఎం జగన్ అండదండలు, సహకారంతో జిల్లాను లూటీ చేసేశారు.తొలుత పేదల ఇళ్ల స్థలాల పేరుతో అవినీతిని ఆరంభించి అక్రమ ఇసుక తవ్వకాలు, గ్రావెల్‌తో పరాకాష్టకు చేర్చారు.కాకినాడ సిటీ వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు, కొత్తపేట ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తదితరులు ఇళ్ల స్థలాలు,చదునులో సంపాదించిన దానికి అంతే లేదు. ఇసుకలో వందల కోట్లతో పడగలెత్తారు. జగన్ అండతో వైసీపీ ఎమ్మెల్యేలు చెలరేగిపోయారు.జగన్ సర్కారు రకరకాల పన్నుల వాత, విద్యుత్ బిల్లుల పెంపుతో జనం నడ్డివిరిచేసింది. మందు బాబులకు షాక్ ఇచ్చారు. కల్తీ మద్యం అమ్మకాలు పెంచేశారు. జిల్లాలో ఐదేళ్ల పాటు రహదారులను గాలికొదిలేయడంతో ఎందరో ప్రమాదాలకు గురై మరణించారు.అటు రీసర్వే పేరుతో ప్రజలను జగన్ ప్రభుత్వం భయపెట్టింది.ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ పేరుతో జనం భూములను కొట్టేసేందుకు సైతం వెనుకాడలేదు. ప్రతి వస్తువుపై బొమ్మలు ముద్రించి జగన్ నయా కిమ్‌ను తలపించారు. అటు జిల్లాల విభజన పేరుతో కోనసీమలో అల్లర్లు రాజేశారు. సీతానగరం నుంచి కాకినాడ వరకు ఎందరో ఎస్సీ యువతపై వైసీపీ పాలకులు దాడులు,హత్యలకు దిగారు. చివరకు ప్రభుత్వ వైఫ ల్యాలను ప్రశ్నించిన ప్రతిపక్ష టీడీపీపై అక్రమ కేసులు నమోదు చేయించింది. ఇలా అక్రమాలు, అరాచకాలు, బెదిరింపు లు ,నియంత విధానాలతో వైసీపీ తన చీకటి పాలన కొనసాగించి ప్రజాస్వామ్యానికి పాతరేసింది.

ఓటేం చేయగలదంటే..

సరిగ్గా 2024 మే 13.. జిల్లా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు.. ఐదేళ్ల వైసీపీ పాలనతో విసుగెత్తిపోయిన జిల్లా ఓటర్లు అరాచకపాలన అంతమొందించడానికి ఏకమ య్యారు. ఓ ఉద్యమం తరహాలో.. కదం తొక్కారు. అన్ని వర్గాలు ఓటుతో కదిలారు. బూత్‌ల వద్ద దండెత్తారు. అర్ధరాత్రి పన్నెండు దాటినా..ఓపక్క వర్షం పడుతున్నా బూత్‌ల నుంచి అడుగుకూడా వెనక్కు వేయలేదు. కసి తీరా ఓటు హక్కు వినియోగించి వైసీపీ అరాచక పాలనకు అంతం పలికారు.ఆ ఏడాది జూన్ 4న ఎన్నికల ఫలితాల రోజు పండగ వాతావరణం నెలకొంది. ఓ నియంత పాలనకు చరమగీతం పడింది.నరకాసుర వధ జరిగిందంటూ ప్రజలు ఆనందంతో రోడ్డెక్కారు. బాణసంచా కాల్చి పండుగ చేసుకున్నారు.

కూటమికే కట్టబెట్టారు

ఉమ్మడి జిల్లాలో వైసీపీకి ఒక్క సీటు కూడా రాకుండా ఓటర్లు ఫ్యాన్ రెక్కలు విరిచేశారు.చరిత్రను సైతం తిరగరాసిన ఈ ఫలితాల్లో కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో 21 సీట్లకు 21 సీట్లు టీడీపీ కూటమి గెల్చుకుని సత్తా చాటింది. నోటుకు ఓటు పడుతుందన్న వైసీపీ భ్రమలను ఓటర్లు చిత్తుచేశారు. గతేడాది వచ్చిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం పార్లమెంట్ స్థానాల పరిధిలో 21 సీట్లకు టీడీపీ 16, జనసేన 6, బీజేపీ ఒక స్థానంలో విజయ దుందుభి మోగించాయి. అటు జనసేన ఉమ్మడి తూర్పులో తొలిసారి అద్భుత ఫలితాలు సాధించింది.గతంలో ఎన్నడూ రానంత మెజార్టీలు కూటమి ఎమ్మెల్యేలకు ఓటర్లు కట్టబెట్టారు. మూడు పార్లమెంట్ స్థానాలు కూటమి కైవసం చేసు కుంది. ఒకరకంగా చెప్పాలంటే గతేడాది వెలువడిన ఫలితాల్లో గోదావరి ఓటర్ల ఆగ్రహావేశాల ప్రవాహంలో వైసీపీ కొట్టుకుపోయి గల్లంతైపోయింది. ప్రజావేశంతో ఫ్యాన్ తునాతునకలైంది.ఓటు దెబ్బకు కుదేలైపోయింది.

వెన్నుపోటు రాజకీయాలకు పేటెంట్ పొందిన జగన్‌రెడ్డి

- టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి



కొత్తపేట, జూన్ 3(ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో వెన్నుపోటు రాజకీయాలకు పేటెంట్ పొందింది జగన్మోహన్ రెడ్డే అని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి అన్నారు. మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ జగన్ ముఠా దర్నాలు ప్రజలను మోసం చేసి వారిని దృష్టి మళ్లించడానికే అన్నారు. తల్లిని, చెల్లిని ఆస్తి కోసం ఇంటి నుంచి వెళ్లగొట్టిన ఘనుడు జగన్ అని, గత వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని విమర్శించారు. మద్య నిషేధం మాట తప్పి విష మద్యంతో పేదల ఆరోగ్యాన్ని దెబ్బతీశారన్నారు.సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలోనే 70శాతం హామీలు అమలు చేసిందన్నారు. ప్రజల పక్షాన నిలిచేది తమ ప్రభుత్వమేనన్నారు.

రేపు 'వికాస'లో ఇంటర్వ్యూలు

అమలాపురం టౌన్, జూన్ 3(ఆంధ్ర జ్యోతి): తెలంగాణాలోని మెదక్ ఐటీసీ ఫుడ్ డివిజన్ కంపెనీలో పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థులకు ఈనెల 5వతేదీ గురువారం కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో ఉదయం 10గంటలనుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ తెలిపారు. జిల్లాలో ఐటీఐ, ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సులు పూర్తి చేసి 29ఏళ్లలోపు వయసు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు తమ బయోడేటాలతో హాజరుకావాలన్నారు. మహిళా అభ్యర్థులకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. మొదటి ఏడాది అప్రెంటిస్‌షిప్‌లో భాగంగా రూ.11వేల చొప్పున స్టైఫండ్ అందజేస్తారని, అనంతరం నెలకు రూ.25వేల చొప్పున వేతనం చెల్లిస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




కాకినాడలో కిక్కిరిసిన స్టేడియం.. బీసీసీఐ ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్





సాగరతీరం.. ఆనంద మైదాన్!



అదిరిన యాంకరింగ్

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానం క్రికెట్ అభిమానులతో కిక్..రిసింది. మంగళవారం జరిగిన ఐపీఎల్ ఫైనల్‌తో క్రికెట్ అభిమానులతో సందడి.. సందడిగా మారింది. క్రికెట్ ప్రేక్షకుల కోసం బీసీసీఐ దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా కాకినాడలో ఏర్పాటు చేసిన ఐపీఎల్ లైవ్ మ్యాచ్ వీక్షణకు అశేష స్పందన లభించింది. గ్రౌండ్‌లో 10 వేల మందికి ఏర్పాట్లు చేయగా 20వేల మంది మ్యాచ్ వీక్షించడానికి హాజరైనట్టు అంచనా. పంజాబ్-బెంగళూరు జట్ల మధ్య మ్యాచ్‌ను క్రికెట్ అభిమానులు తరలివచ్చి ఆనందంగా వీక్షించారు. లైవ్ షో వీక్షించేందుకు విచ్చేసిన క్రికెట్ అభిమానులకు ఏర్పాటు చేసిన లక్కీ డ్రాను రాజ్యసభ ఎంపీ, ఏసీఏ సెక్రటరీ సానా సతీష్‌బాబు డ్రా తీసి గెలుపొందిన చిన్నారికి కోహ్లీ సంతకంతో ఉన్న టీషర్టు అందించారు. మ్యాచ్ మధ్యలో డీజే ప్లే చేయడంతో డ్యాన్సులతో అదరగొట్టారు. చివరన బాణసంచా కాల్చారు.



హాల్..సెల్ చేద్దాం..



నీవే విజేత : డ్రా గెలిచిన చిన్నారికి కోహ్లీ టీషర్ట్ అందించిన ఎంపీ సానా

బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ



ఐ.పోలవరంలో పరిహారం పంపిణీ చేస్తున్న ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

ముమ్మిడివరం మండలం కమినివద్ద, పి.గన్నవరం మండలం నాగుల్లంక దిగువున తూర్పు, పశ్చిమ గోదావరిజిల్లా సరిహద్దు రావిలంకవద్ద వేర్వేరు ఘటనల్లో గోదావరిలో యువకులు మృతి చెందగా బాధిత కుటుంబాలకు మంజూరు చేసిన పరిహారం చెక్కులను మంగళవారం అందజేశారు.



పి.గన్నవరం బాధిత కుటుంబానికి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, కూటమి నేతలు

నూతన విద్యాసంవత్సరంలో...

మార్పులపై దృష్టిసారించాలి

- డీఈవో షేక్ సలీంబాషా

అమలాపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరంలో అమలు కానున్న ప్రధాన మార్పులపై దృష్టి సారించాలని డీఈవో షేక్ సలీంబాషా ఉపాధ్యాయులకు సూచించారు. అమలాపురం జడ్పీ బాలికోన్నత పాఠశాలలో సెకండరీ స్థాయి ఉపాధ్యాయులకు, జిల్లా రిసోర్స్ పర్సన్ల మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సమగ్రశిక్ష అదనపు కోఆర్డినేటర్ జి.మమ్మీ ప్రారంభించారు. జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో సలీంబాషా మాట్లాడుతూ విద్యార్థులకోసం ప్రత్యేకంగా రూపొందించిన ఆన్సర్ బుక్స్, పరీక్షా విధానంలో చోటు చేసుకున్న మార్పులు, తరగతి గది బోధనలో వినియోగించాల్సిన టీచ్‌టూల్స్, అబ్జర్వేషన్ పద్ధతులు, నూతన అకడమిక్ క్యాలెండర్ అంశాలపై శిక్షణ విశ్లేషణా కార్యక్రమాలు ఉంటాయన్నారు. కోర్సు సంచాలకులుగా డీఈవో వ్యవహరిస్తారు. శిక్షణ కార్యక్రమానికి ఇన్‌చార్జిగా బీర హనుమంతరావు, కోర్సు కోఆర్డినేటర్‌గా జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం పర్యవేక్షిస్తారు. సమగ్రశిక్ష అదనపు కోఆర్డినేటర్ మమ్మీ మాట్లాడుతూ మధ్యాహ్న సమయంలో తరగతి గదుల్లో శిక్షణ ప్రాసెస్‌ను ప్రత్యక్షంగా పర్యవేక్షించిన డీఈవో నూతన విద్యాసంవత్సరానికి సంబంధించి మార్పులపై ప్రత్యేక తరగతిని నిర్వహించారన్నారు. నూతన విద్యావిధానాలపై స్పష్టత పొందడంతోపాటు విద్యార్థులకు మరింత సమర్థవంతమైన బోధన అందించాలన్నారు. రాష్ట్ర పరిశీలకులుగా ఎస్‌ఈఆర్టీ సబ్జెక్టు ఎక్స్‌పర్ట్ పవన్‌రామ్, డైట్ లెక్చరర్ కె.కృష్ణసాయి పాల్గొన్నారు. కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, ఏఎల్ఐ ఎస్‌సీ కోఆర్డినేటర్ రమేష్, ఎంఈకే భీమారావు, హెచ్ఎం విజయకుమారి పాల్గొన్నారు.



అమలాపురం జడ్పీ బాలికోన్నత పాఠశాలలో రిసోర్స్ పర్సన్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో



విల్లు ఎక్కుపెట్టిన నిత్యశ్రీ, అశ్విన్

చిట్టి చేతులతో విల్లు పట్టుకుని బాణం ఎక్కుపెడితే గురి తప్పదు. ఐదేళ్ల ఆ చిన్నారి ప్రతిభ చూసి జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో అందరూ ఆశ్చర్యపోయి ప్రశంసల వర్షం కురిపించారు. ఆ ఏడేళ్ల బాలుడు విల్లుతో లక్ష్యాన్ని చేధించి పతకాల పంట పండిస్తున్నాడు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని మరికొందరు చిన్నారులు ఇప్పుడు శిక్షణ పొందుతున్నారు. ఆర్చరీ పోటీల్లో చిన్నారులు చూపుతున్న ప్రతిభ అందరినీ అబ్బుర పరుస్తోంది. చిన్న వయసులోనే ప్రతిభ కనబరుస్తున్న వీరికి శిక్షణ ఇచ్చేందుకు సౌకర్యాలు కల్పించడంతో పాటు ఉన్నత స్థాయిలో మరింతగా శిక్షణ ఇస్తే అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించడం ఖాయంగా కనిపిస్తోంది.

చిట్టి చేతులతో పతకాల వేట

- వారు విల్లు ఎక్కుపెడితే గురి తప్పదు
- ఆర్చరీ పోటీల్లో అబ్బురపరుస్తున్న చిన్నారులు
- జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న ఐదేళ్ల నిత్యశ్రీ
- జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పతకాలు సాధించిన ఏడేళ్ల అశ్విన్

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

యువతీ, యువకులు తొలిసారి విల్లు ఎక్కుపెడితేనే చేయి వణుకుతుంది. అయితే ఈ చిన్నారుల్లో మాత్రం ఎక్కడా బెరుకు కనిపించదు. లక్ష్యాన్ని గురిచూసి కొట్టి పతకాలు సాధిస్తూ ఉంటారు. వారి ప్రతిభను చూసి ఆర్చరీలో నిష్ణాతులైన వారే ఔరా అంటున్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెం గ్రామానికి చెందిన ముమ్మిడి సూర్యసాయి నిత్యశ్రీ ఐదేళ్లకే జాతీయ స్థాయిలో అండర్-10 ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంది. తృటిలో పతకం చేజార్చుకున్నా ఆర్చరీ అసోసియేషన్ పెద్దలు చిన్నారి ప్రతిభను గుర్తించి ప్రశంసించారు.

పిఠాపురం పట్టణంలోని రథాలపేటకు చెందిన ఏడేళ్ల బాలుడు శెట్టిబత్తిన అశ్విన్ గత రెండేళ్లుగా జిల్లా స్థాయిలో పలు పతకాలు సాధించడమే గాక రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ పాల్గొని సత్తా చాటుతున్నాడు. వీరిని చూసి మరికొంతమంది చిన్నారులే కాక బాలబాలికలు, యువతీ, యువకులు ఆర్చరీలో శిక్షణ పొందేందుకు ముందుకు వస్తున్నారు. ఈ చిన్నారుల ప్రతిభ వెనుక కోచ్ పి.లక్ష్మణరావు శ్రమ ఎంతో ఉంది. కనీస సౌకర్యాలు లేకున్నా ఆర్చరీలో వారికి శిక్షణ ఇవ్వడమే గాక ఇతర రాష్ట్రాల క్రీడాకారులతో పోటీపడేలా తీర్చిదిద్దుతున్నారు. ఈ చిన్నారుల కోసం ప్రత్యేకంగా విల్లు, బాణం తయారు చేయించి శిక్షణ ఇచ్చి తర్వాత పోటీల్లో విల్లు ఎక్కుపెట్టే లక్ష్యాన్ని గురితప్పకుండా కొట్టేలా సన్నద్ధం చేశారు. అందుకు తగ్గట్టుగానే వీరు చూపుతున్న ప్రతిభ అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ ఇద్దరు చిన్నారులతో పోటీపడేందుకు పెద్ద వయసు వారు సైతం వెనుకడుగు వేస్తుండడం గమనార్హం.

సౌకర్యాలు కల్పిస్తే...

ఆర్చరీ అంటేనే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. విల్లు, బాణం ఖరీదు వేలల్లో ఉంటాయి. శిక్షణ, పోటీలు జరిగే పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎటువంటి సౌకర్యాలు లేవు. అయినప్పటికీ కోచ్ లక్ష్మణరావు ఉన్న వాటితోనే శిక్షణ ఇస్తూ చిన్నారులు పలు పతకాలు సాధించేలా కృషి చేస్తున్నారు. ఇక్కడ మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే ఎక్కువ మంది ఆర్చరీలో శిక్షణ పొందే అవకాశాలు కలగడంతో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో మన క్రీడాకారులు ప్రతిభ చూపుతారని పలువురు అభిప్రాయపడుతున్నారు.



పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో ఆర్చరీలో ఔత్సాహికులకు శిక్షణ ఇస్తున్న కోచ్ లక్ష్మణరావు

చిన్నారుల ప్రతిభ, ఆసక్తి గుర్తించి శిక్షణ



పి.లక్ష్మణరావు, ఆర్చరీ కోచ్,
ఆర్చరీ అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి

చిన్నారులు నిత్యశ్రీ, అశ్విన్ విల్లు పట్టుకోవడంలో చూపిన ప్రతిభ, ఆసక్తి చూసి ప్రత్యేక శిక్షణ ప్రారంభించాను. విల్లు ఎక్కు పెట్టి గురితప్పకుండా లక్ష్యాన్ని బాణంతో కొడతారు. వీరిని చూసి పెద్ద వయసు వారూ నేర్చుకుంటున్నారు. ఈ చిన్నారుల స్ఫూర్తితో 4 నుంచి 9 సంవత్సరాల వయసు ఉన్న వారు శిక్షణ పొందేందుకు ముందుకు వచ్చారు. ఈ ఏడాది వీరికి శిక్షణ ఇచ్చాం. ఆర్చరీకి అవసరమైన కనీస సౌకర్యాలు, విల్లులు, బాణాలు, ఇతర పరికరాలు సమకూరిస్తే జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో మన వారు పతకాలు సాధించేలా తీర్చిదిద్దుతాను.

నాలుగేళ్లకే విల్లు పట్టిన నిత్యశ్రీ



నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న నిత్యశ్రీ

ఐదేళ్లకే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న ముమ్మిడి సూర్యసాయి నిత్యశ్రీ నాలుగు సంవత్సరాల వయస్సులోనే విల్లు పట్టింది. గత ఏడాది పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో కోచ్ పి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరుగుతున్న ఆర్చరీ వేసవి శిక్షణ తరగతులను చూసేందుకు వచ్చింది. నిత్యశ్రీ విల్లు పట్టుకునేందుకు ఆసక్తి చూపడంతో చిన్న విల్లు ఇచ్చి ఎక్కుపెట్టమన్నారు. బెరుకు లేకుండా లక్ష్యాన్ని గురిచూసి కొట్టడం గమనించిన కోచ్ లక్ష్మణరావు ఆ చిన్నారికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న శిక్షణ కేంద్రానికి ఆమె తండ్రి గణేష్ ప్రతిరోజూ ఇంటి నుంచి క్రమం తప్పకుండా శిక్షణకు తీసుకెళ్లేవారు. శిక్షణ ద్వారా నైపుణ్యాన్ని సాధించడమే కాకుండా పెద్దలకు సాధ్యం కాని రీతిలో బాణం లక్ష్యాన్ని కొడుతుండడం చూసి తొలుత పిఠాపురంలో జరిగిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో అండర్-10 ఇండియన్ రౌండ్ పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించారు. తన కంటే పెద్దవారితో తలపడి విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో ఆమె ప్రతిభను చూసిన ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించారు. అక్కడ ప్రతిభ చూపి స్కోర్ విభాగంలో రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. గుంటూరు నాగార్జున యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన జాతీయ స్థాయి ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున అండర్-10 ఇండియన్ రౌండ్ విభాగం పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచింది. తృటిలో పతకాన్ని చేజార్చుకున్నా పలు రాష్ట్రాల, జాతీయ ఆర్చరీ కోచ్‌లు, అసోసియేషన్ ప్రతినిధుల ప్రశంసలు అందుకుంది. ఈసారి జాతీయ స్థాయిలో పతకాల సాధనే లక్ష్యంగా మరలా శిక్షణ పొందుతోంది. ఈమెకు కోచ్ లక్ష్మణరావు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు.



జాతీయ స్థాయి ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచిన నిత్యశ్రీని అభినందిస్తున్న స్థానికులు

అశ్విన్ ఇంట పతకాల పంట



సాధించిన పతకాలతో అశ్విన్

ఏడేళ్ల శెట్టిబత్తిన అశ్విన్ రెండేళ్లుగా జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని పలు పతకాలు సాధించాడు. రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ చాటాడు. తండ్రి సురేష్ కుమారుడిని దగ్గరుండి ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని శిబిరానికి మూడేళ్లుగా తీసుకెళ్తూ లక్ష్మణరావుతో శిక్షణ ఇప్పిస్తున్నారు. అశ్విన్ చిన్ననాటి నుంచే విల్లు ఎక్కు పెట్టడంలో చూపుతున్న సత్తా ఆకట్టుకుంటోంది. ఐదేళ్ల వయసు నుంచే జిల్లా స్థాయి పోటీల్లో విజేతగా నిలిచాడు. కాకినాడలో 2023లో జరిగిన మినీ ఒలింపియాడ్‌లో బంగారు పతకం, 2024 ఏప్రిల్‌లో ఆర్చరీ అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో కాంస్య పతకం సాధించాడు. 2024 జూన్‌లో జరిగిన పోటీల్లో పది మీటర్ల విభాగంలో మొదటి స్థానం, నవంబరులో జరిగిన పోటీల్లో 15 మీటర్ల విభాగంలో రజత పతకం గెల్చుకున్నాడు. 2025 జనవరిలో పిఠాపురంలో జరిగిన పోటీల్లో రజత పతకం సాధించాడు. విజయవాడతో పాటు వివిధ ప్రాంతాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహించాడు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాల సాధనే ధ్యేయంగా శిక్షణ పొందుతున్నాడు.

తగ్గేదేలే..

ఆగని ఇసుక దందా

- అధికారుల ఆదేశాలు బేఖాతరు
- ఈనెల 1నుంచి అక్టోబరు 15వరకూ 28 ఇసుక ర్యాంపులను నిలిపివేస్తూ ఆదేశాలు
- వేల టన్నుల అక్రమ తవ్వకాలు



కాతేరు ర్యాంపులో మంగళవారం ఇసుక తవ్వకాలు జరుగుతున్న దృశ్యం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఇసుక రుచి మరిగిన కొందరు వ్యాపారులు అధికార్లను కూడా లెక్కచేయడం లేదు. వర్షాకాలం ప్రారంభం కావడంతోపాటు, అటవీశాఖ నిబంధనలకు అనుగుణంగా జిల్లాలో 15 ఓపెన్ రీచ్‌లు, 10 సెమీ మెకనైజ్డ్ రీచ్‌లు, 3 పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలు జూన్ 1నుంచి ఆపేసినట్టు అధికారులు ప్రకటించిన సంగతి తెలిసిందే. 18 డీసిల్టేషన్ పాయింట్లలో మాత్రం ఇసుక తవ్వకాలు జరపడంతోపాటు ఆ జిల్లాలో 29 స్టాక్ పాయింట్లలో అధికారులు నిర్ణయించిన ధర ప్రకారం ఇసుక విక్రయించాలని కూడా ఆదేశాలిచ్చారు. కానీ ఎవరూ ఇసుక తీత ఆపలేదు. కాతేరు, సీతానగరం, కొవ్వూరు, తాళ్లపూడి, ఇతర ప్రాంతాలలో కూడా యథావిధిగా ఇసుక తవ్వకాలు జరిగాయి.



ఇసుక లోడింగ్‌కు వెళుతున్న భారీ లారీ

తాళ్లపూడిలో ఇన్‌చార్జి తహశీల్దార్ మాత్రం ఒక వాహనాన్ని సీజ్ చేశారు.

జిల్లాలో ఆగిపోయిన ర్యాంపుల వివరాలను అధికారులు ప్రకటించిన సంగతి తెలిసిందే. కొవ్వూరు మండలంలోని అరికిరేవుల, చిడిపి, సెమీ మెకనైజ్డ్‌రీచ్‌లు, తాళ్లపూడి మండలంలోని ప్రక్కిలంక సెమీ మైకనైజ్డ్ రీచ్‌లు, నిడదవోలు మండలంలోని పురుషోత్తపల్లి మెకనైజ్డ్ రీచ్‌లను, సీతానగరం మండలం పరిధిలోని ములకల్లంక, మునికూడలి-1,2 పట్టాభూములు నిలిపివేసిన సంగతి తెలిసిందే. అక్కడా తవ్వకాలు ఆగలేదు. ఇక మాన్యువల్ రీచ్‌లకు సంబంధించి కొవ్వూరులోని చిడిపి, కుమారదేవంలోని మూడు ర్యాంపులు, నిడదవోలులోని జీడిగుంట, పెరవలి మండలంలోని కాకరపర్రు, పందలపర్రు, పెండ్యాల, సీతానగరం మండలంలోని ములకల్లంక- కాటవరం, వంగలపూడి-1, వంగలపూడి-2, పెరవలి మండలంలోని తీపర్రు-2, తీపర్రు 3 తాళ్లపూడిలోని వేగేశ్వరపురం, కడియంలోని వేమగిరి- కడియపులంక రీచ్‌లను అధికారులు నిలిపివేసినట్టు అధికారులు ప్రకటించినా, క్షేత్రస్థాయిలో మాత్రం ఇవి ఆగకపోవడం గమనార్హం.

ప్రభుత్వం నిలిపివేసినా..

సీతానగరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలంలోని ములకల్లంక, మునికూడలి-1, 2, కాటవరం, వంగలపూడి ర్యాంపులతో పాటు మునికూడలి ర్యాంపు నుంచి వెళుతున్న ప్రక్కిలంక రీచ్‌లు ఉన్నాయి. ఈ రీచ్‌లలో 1వ తేదీ నుంచి ఇసుక రవాణా గాని, ఇసుక డంపింగ్ గాని చేయడానికి లేదు. అయితే మండలంలోని ఇసుక ర్యాంపుల్లో ఇసుక రవాణా నిలిచిపోయినా ప్రక్కిలంక ర్యాంపు మాత్రం కొనసాగుతోంది. అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ ర్యాంపు యాజమాన్యం డంపింగ్ కొనసాగిస్తోంది. స్టాకు పాయింట్ల వద్ద 2, గోదావరి నదీ గర్భంలో 3 ఎక్స్‌కవేటర్లతో డంపింగ్ చేస్తున్నారు. రాత్రిపూట లారీల్లో ఇసుక రవాణా చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై తహశీల్దార్ ఎ.శ్రీనివాస్‌ను వివరణ కోరగా వెంటనే ర్యాంపు నిలిపివేస్తామని ప్రభుత్వ ఆదేశాల మేరకు డంపింగ్ గాని, రవాణా గాని చేయకూడదన్నారు.



తాళ్లపూడిలో ఇసుక తరలిస్తున్న లారీని సీజ్ చేస్తున్న అధికారులు

ఇసుక లారీ సీజ్

తాళ్లపూడి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపూడి ఓపెన్ రీచ్‌లో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నట్టు సమాచారం అందడంతో రెవెన్యూ సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ పోలీసులు కలిసి దాడి చేసి లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు ఇన్‌చార్జి తహశీల్దార్ మోహనభారతి తెలిపారు. అనధికార కార్యకలాపాలు నిర్వహిస్తున్న దృష్ట్యా ఓపెన్ రీచ్ యాజమాన్యానికి నోటీసు జారీచేశామన్నారు. ఓపెన్ రీచ్‌లలో అక్టోబరు 15వ తారీఖు వరకూ ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించరాదని, ఈ మేరకు మైన్స్ శాఖ ఆధ్వర్యంలో ప్రకటన విడుదల చేశారని పేర్కొన్నారు.

తూర్పున వాటర్, శానిటేషన్ భేష్

కేంద్ర బృందం మెచ్చుకోలు



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర బృంద సభ్యుడు

రాజమహేంద్రవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జల జీవన్ మిషన్‌లో భాగమైన వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ నిర్వహణ తీరు భేషుగ్గా ఉందని కేంద్ర బృందం మెచ్చుకుంది. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి నీరు అండ్ స్వచ్ఛత మిషన్ నోడల్ అధికారి పూర్ణచంద్ర కిషన్ అధ్యక్షతన జిల్లా వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నీరు, స్వచ్ఛత మిషన్ రూపకల్పన, అమలు చేస్తున్న తీరు బాగుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అధిక లవణీయత, నీటి ఎద్దడి ఉన్న అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో పర్యటించి ప్రత్యక్షంగా పరిశీలించినట్టు చెప్పారు. జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పనిచేస్తోందని, కానీ నిర్వహణ ఖర్చులపై దృష్టి పెట్టాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో అధిక భాగం నిర్వహణ ఖర్చు కావడానికి కారణాలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కమిషన్ సమావేశాలు ప్రతినెలా జరపాలని చెప్పారు. మిషన్ నిర్వహణ లోపాలను, ప్రజా సమస్యలు తెలియజేయడానికి అందుబాటులో ఉన్న వివిధ మార్గాలపై బృందం ఆరా తీసింది. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ నీటి ఎద్దడి గల గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజలు సమస్యలు తెలపడానికి పీజీఆర్ఎస్‌తో పాటు 1100 టోల్‌ఫ్రీ నెంబర్ల వ్యవస్థ ఉన్న సంగతిని ఆమె కేంద్ర బృందానికి వివరించారు. కేంద్ర బృందంలో జాతీయ వాష్ నిపుణుడైన బిశ్వదీప్‌దాస్ సాంకేతిక అంశాల్లో కొన్ని మార్పులను సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ జీవీ గిరి తదితరులు పాల్గొన్నారు.

తుని కేసులపై అప్పీల్ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవడం హర్షణీయం

రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు



కాకినాడ సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో రైలు దహనం కేసులపై అప్పీల్ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవడం హర్షణీయమని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో దూరదృష్టితో సామాజిక సమతుల్యతను కాపాడేలా నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. తెలుగుదేశం పార్టీ కాపుల పక్షపాతి అని ఈ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవడం నిరూపించాయన్నారు. ఈ విషయమై కాపుల్లో గొడవలు సృష్టించాలని చూసిన వారు భంగపడ్డారన్నారు. 2016 సంవత్సరంలో ముద్రగడ పద్మనాభం సారధ్యంలో తలపెట్టిన ఛలో తుని కార్యక్రమం హింసాత్మకంగా మారి అటు నుంచి వెళ్తున్న రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలును కొందరు దుండగులు తగులబెట్టారన్నారు. దీనిపై అప్పట్లో రైల్వే యాక్ట్ ప్రకాకం కేసులు నమోదు చేశారన్నారు. గత ప్రభుత్వంలో ఈ కేసులను రద్దు చేశారన్నారు. ఈ కేసులపై పునర్విచారణ కోసం అభ్యర్థించాలని హోం శాఖ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. దీనిపై సామాజిక సమతుల్యతను కాపాడే విధంగా ఈ ఉత్తర్వులు రద్దు చేసేలా కృషి చేసిన మంత్రి లోకేశ్‌కు సతీష్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

తీర్థయాత్రలకు ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సులు

10న అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు



రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ రాజమహేంద్రవరం డిపో నుంచి సూపర్‌లగ్జరీ బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 10వ తేదీ సాయంత్రం 4గంటలకు రాజమహేంద్రవరం డిపో నుంచి అరుణాలచం గిరి ప్రదక్షిణ కోసం ప్రత్యేక బస్సు బయలుదేరుతుందని తెలిపారు. అరుణాచలం, కాణిపాకం, తిరుపతి క్షేత్రాలు చూపించడం జరుగుతుందని, టిక్కెట్ ధర రూ.3,500లుగా నిర్ణయించినట్టు తెలిపారు. అలాగే 27న రాజమహేంద్రవరం డిపో నుంచి అరుణాచలం, రామేశ్వరం యాత్రకు బస్సు నడుపుతున్నామని వెల్లడించారు. ఈ యాత్రలో కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, పళని, కొయంబత్తూరు, ఊటీ, మైసూరు, గురువాయూర్, త్రివేండ్రం, రామేశ్వరం, కన్యాకుమారి, మధురై, శ్రీరంగం, తంజావూరు క్షేత్రాలు దర్శించుకోవచ్చని తెలిపారు. 9 రోజుల ఈ యాత్ర టిక్కెట్ రూ.11,300లుగా పేర్కొన్నారు. టిక్కెట్లు కావలసిన వారు, మరింత సమాచారం కోసం సెల్ 95023 00189, 99666 66544 నెంబర్లలో సంప్రదించాలని డిపో మేనేజర్ కోరారు.

నేటి సాయంత్రం ఐదులోపు

వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవాలి

కాకినాడ డీఈవో రమేష్

కాకినాడ రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు బుధవారం సాయంత్రం 5లోపు బదిలీలకు సంబంధించిన వెబ్ ఆప్షన్స్ నమోదుచేసుకోవాలని డీఈవో పి.రమేష్ తెలిపారు. ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ మేనేజ్‌మెంట్ల స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులంతా వెబ్ ఆప్షన్స్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

ఆలిండియా చెస్ రేటింగ్స్‌లో పీయూష్‌కు ఉత్తమ ర్యాంకు



రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదల చేసిన ఆలిండియా చెస్ రేటింగ్స్‌లో రాజమండ్రి నగరానికి చెందిన మద్దాలి పీయూష్ శ్రీపార్థు 1407 ర్యాంక్ సాధించాడని కోచ్ వరదా సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పియూష్‌శ్రీపార్థు రెండేళ్లుగా సురేష్ చెస్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడని తండ్రి శ్రీహర్ష తెలిపారు. ఉత్తమ ర్యాంకు సాధించిన శ్రీపార్థుని ఈస్ట్ గోదావరి అసోసియేషన్ సెక్రటరీ జీవీ కుమార్, వైస్ ప్రెసిడెంట్ వై.కళ్యాణ్‌కుమార్ అభినందించారు.

సాగర..యోగా

- అంతర్వేది బీచ్‌లో యోగాంధ్ర కార్యక్రమం
- 4వేల మందితో యోగాసనాలు
- పాల్గొన్న జిల్లా ఉన్నతాధికారులు, ప్రజలు





యోగా ముద్రలో ఏర్పడిన ప్రజలు

అంతర్వేది, జూన్ 3(ఆంధ్రజ్యోతి): అంతర్వేది సాగర తీరం యోగాకు వేదికగా నిలిచింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది బీచ్‌లో మంగళవారం 4వేల మందితో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన యోగాంధ్ర 2025లో భాగంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. తీరంలో ఎగసిపడుతున్న కెరటాల నడుమ సూర్యోదయ కిరణాల మధ్య 4వేల మంది సామూహిక యోగాసనాలు చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, డీఆర్వో డి.రాజకుమారి, అమలాపురం ఆర్డీవో కె.మాధవి, డీఈవో షేక్ సలీం బాషా, డ్వామా పీడీ మధుసూదన్, నోడల్ ఆఫీసర్ రాజేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ శాంత కుమారి, జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్కే నవాజ్‌జాన్, జిల్లా అధికారులు, మాజీ సైనికులు, యువకులు, విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 7.30 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం గంటన్నరపాటు సాగింది. యోగా గురువు పి.రామచంద్ర సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం, యోగాసనాలను వివరించారు. సుమారు 200 మంది సమన్వయంగా నిలబడి చేసిన వృక్షాసనం చూపరులను ఆకట్టుకుంది. జేసీ మట్లాడుతూ రోజు 10నిమిషాలైనా యోగా చేయడం వల్ల జీవితంలో మంచి మార్పులు వస్తాయన్నారు. కార్యక్రమానికి హాజరైన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ పూజా వేగేశ్నకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, చాగంటి స్వామి, జిల్లా ఏసీ వి.సత్యనారాయణ తదితరులున్నారు.



యోగసనాలు వేస్తున్న జేసీ నిషాంతి



అంతర్వేది బీచ్‌లో యోగాంధ్ర కార్యక్రమ డ్రోన్ చిత్రం.. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజలు





యోగా బ్రిడ్జి

యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం యోగాపై విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. యోగాంధ్ర పేరిట పలు కార్యక్రమాలు చేపడుతోంది. కాకినాడలోని కొండయ్యపాలెం బ్రిడ్జి గోడలపై యోగాసనాలను ఇలా చిత్రీకరించి అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

స్టాఫ్ ఫొటోగ్రాఫర్- కాకినాడ

మన్యంలో ఏకపక్షంగా అధికారుల తీరు

- ఆక్రమణల తొలగింపు పేరుతో చట్టవిరుద్ధంగా విధ్వంసం
- రాష్ట్ర ప్రభుత్వ పాలనకు మచ్చ వచ్చేలా చర్యలు
- టీడీపీ అధిష్ఠానం, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లిన స్థానిక నేతలు



రంపచోడవరంలో అధికారులు నేలమట్టం చేసిన నిర్మాణాలు

రంపచోడవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మన్యంలో అధికారుల తీరు ఏకపక్షంగా కనిపిస్తోంది. రంపచోడవరం నియోజకవర్గంలోని మారేడుమిల్లి, రంపచోడవరంల్లో 3 రోజులుగా ఆక్రమణల తొలగింపు పేరుతో ఐటీడీఏ, రెవెన్యూ అధికారులు సాగిస్తున్న విధ్వంసం గిరిజన, గిరి జనేతర తేడా లేకుండా తీరని నష్టాన్ని చేకూర్చింది. ఆర్‌అండ్‌బీ రహదారి వెంబడి ఉన్న ఆక్రమణలను తొలగించే దిశగా ఆక్రమణ దారులకు చట్టప్రకారం నోటీసులు ఇచ్చిన అధికారులు తదుపరి చట్ట విరుద్ధంగా వ్యవహరించి ఎక్స్‌కవేటర్లతో.. మిషన్లతో నిర్మాణాలను నేలమట్టం చేశారు.

పనులు మంజూరు కాకుండానే..

రంపచోడవరం మండలం ఐ.పోలవరం నుంచి భద్రాచలం రహదారి విస్తరణకు ఇంతవరకూ ఎటువంటి పనులూ మంజూరుకాలేదు. ఈ రహదారుల వెంబడి దశాబ్దాల కాలంగా జీవనాన్ని సాగిస్తున్న ప్రజల నిర్మాణాలను తొలగించాలని ప్రభుత్వం ఇక్కడి అధికారులకు ఎటువంటి ఉత్తర్వులూ ఇవ్వలేదు. ఒకవేళ విస్తరణ పనులు మంజూరు చేస్తే దానికి భూసేకరణ చేపట్టి ఆక్రమణదారులకు పరిహారాన్ని చెల్లిస్తుంది. ఇటీవల 516-ఈ జాతీయ రహదారి ప్రాజెక్టును చేపట్టి రంపచోడవరం డివిజన్ నుంచి పాడేరు డివిజన్ వరకూ ఉన్న పూర్వపు రహదారిని అనుకుని ఉన్న అందరి ఆక్రమణదారులకూ పరిహారం ఇచ్చి మరీ రోడ్డు విస్తరణ చేపట్టింది. ఇది తెలిసీ కూడా ఇక్కడి ఉన్నతాధికారులు రహదారి విస్తరణ పనుల మంజూరు కాకుండానే ఆక్రమణలను బలవంతంగా తొలగించి రోజువారీ ఆదాయంతో జీవనం సాగించే వందలాది కుటుంబాలను నిరాశ్రయులను చేశారు. అధికారుల అత్యుత్సాహం ప్రభుత్వానికే మచ్చ తెచ్చేలా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాస్థాయి నుంచి మండలస్థాయి వరకూ అందరి అధికారుల తీరు మన్యంలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఓ ఉన్నతాధికారి వాహనానికి రంపచోడవరంలో ఓ ప్రైవేటు వాహనం అడ్డు రావడం ఆ అధికారి అహాన్ని దెబ్బతీసింది. దీంతో ఆయన అహాన్ని సంతృప్తిపర్చడం కోసమే ఇంతటి విధ్వంసానికి అధికారులు పాల్పడ్డారన్న విమర్శలూ వస్తున్నాయి.

సానుకూల స్పందన ఏది..

అధికారుల తీరుతో ప్రజల నుంచి వ్యక్తమవుతున్న ఆవేదనలను కూటమి ప్రభుత్వంలోని నేతలు, ప్రజాప్రతినిధులూ ఆయా అధికారులకు విన్నవించినా వారు సానుకూలంగా స్పందించలేదు. దీనిపై వైసీపీ నేతలు వ్యతిరేక ప్రచారం నిర్వహించడానికి మాత్రం అవకాశాన్ని ఇచ్చారు. పలు మాధ్యమాలు, ఫిర్యాదుల ద్వారా ఇప్పటికే ఇక్కడ అధికారుల తీరు తెన్నులపై టీడీపీ ప్రధాన కార్యాలయానికి విషయం చేరింది. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్సులో మంగళవారం ఇక్కడి ప్రజల ఇబ్బందులను ఏకరువు పెట్టి సర్వం కోల్పోయిన ప్రజలకు పునరావాసాన్ని కల్పించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు అధికారుల చర్యలపై మీడియాకి ఎక్కారు. మాజీ ఎంపీ, బీజేపీ నేత కొత్తపల్లి గీత స్పందించి మంత్రి లోకేశ్‌కు ఇక్కడి పరిస్థితిని వివరించారు. బాధితులైతే నేరుగా గిరిజనులు, గిరిజనేతరులు వేర్వేరుగా హక్కుల కమిషన్‌కు ఫిర్యాదులు చేసి అధికారులపై చర్యలు, వారి నుంచి పరిహారాన్ని కోరుతున్నారు.

బాధితులకు అండగా ప్రభుత్వం

రంపచోడవరంలో నష్టాన్ని వివరించిన ఎమ్మెల్యే శిరీష



మంగళగిరి కార్యాలయంలో మంత్రి సుభాష్‌తో ఎమ్మెల్యే శిరీష

రంపచోడవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం, మారేడుమిల్లిలో ఆర్‌అండ్‌బీ రహదారిని ఆనుకుని ఉన్న నిర్మాణాలను నేలమట్టం చేసిన నేపథ్యంలో నష్టపోయిన బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. మంగళవారం ఆమె తన భర్త మట్టం విజయభాస్కర్‌తో కలిసి మంగళగిరి టీడీపీ ప్రధాన కార్యాలయంలో మంత్రి సుభాష్ నిర్వహించిన గ్రీవెన్సు విభాగంలో రంపచోడవరం, మారేడుమిల్లి రహదారి వెంబడి నిర్మాణాలను నేలమట్టం చేసిన అంశాన్ని ఏకరువు పెట్టారు. అధికారుల తీరుతో ప్రజలకు చేకూరిన నష్టాన్ని వివరించారు. సాగుతున్న ఆక్రమణల తొలగింపును నిలుపుదల చేయాలని కోరారు.

బాధితులను ఆదుకునేందుకు కృషి : మాజీ ఎంపీ గీత

రంపచోడవరం నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రహదారి వెంబడి ఉన్న నిర్మాణాల తొలగింపుతో నష్టపోయిన బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉందని, వారిని ఆదుకోవడంలో తన వంతు కృషి చేసి న్యాయం చేస్తానని మాజీ ఎంపీ, బీజేపీ నేత కొత్తపల్లి గీత పేర్కొన్నారు. మంగళవారం ఆమె మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. రంపచోడవరం, మారేడుమిల్లిలో ఆక్రమణ తొలగింపు ప్రక్రియలో పలు నిర్మాణాలను అధికారులు నేలమట్టం చేసిన అంశంపై తాను పరిశీలన చేయించగా బాధితుల నుంచి అనేక ఆవేదనలు వ్యక్తమయ్యాయని పేర్కొన్నారు. అనంతరం తాను ప్రభుత్వ పెద్దలతో ఈ అంశాన్ని చర్చించానని, పరిస్థితిని వారికి వివరించానని ఆమె పేర్కొన్నారు.

తప్పిన ప్రమాదం

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న గ్యాస్ సిలిండర్ల లారీ

నిలిచిన విద్యుత్ సరఫరా



విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొన్న లారీ

సామర్లకోట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ పరిధిలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద మంగళవారం మధ్యాహ్నం గ్యాస్ సిలిండర్ల రవాణా లారీ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. స్తంభం విరిగిపోయి విద్యుత్ లైన్లు తెగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లేకుంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. విద్యుత్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

హోటల్‌లోకి దూసుకుపోయిన లారీ

మండపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా మండపేట మండలం తాపేశ్వరం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి కంకరలారీ హోటల్‌లోకి దూసుకుపోయింది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు సమీపంలో ఉన్న పంగిడి నుంచి కంకరను తీసుకుని మండపేట వైపు వస్తుండగా సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత తాపేశ్వరంలో వీరవల్లి బిర్యాని హోటల్‌లోకి దూసుకుపోయింది. హోటల్ ధ్వంసం కావటంతో పాటు సామన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆస్తినష్టం తప్ప ప్రాణనష్టం వాటిల్లలేదు.



సిరిగలపల్లిలంకలో చైన్ స్నాచింగ్

స్కూటీపై వెళ్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరణ



బాధితురాలు, స్థానికులను విచారిస్తున్న పోలీసులు

కరప, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేములవాడ శివారు సిరిగలపల్లిలంక గ్రామంలో చైన్ స్నాచింగ్ జరిగింది. బాధితులు, పోలీసుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాజులూరు మండలం గొల్లపాలెంలో నివాసముంటున్న కొండేపూడి శాంతికుమారి కరప మండలం వేళంగి స్టేట్‌బ్యాంక్‌లో టెంపరరీ మెసెంజర్‌గా పనిచేస్తుంది. సోమవారం రాత్రి డ్యూటీ ముగించుకుని స్కూటీపై ఇంటికి బయలుదేరింది. సిరిగలపల్లిలంక దాటిన వెంటనే వెనుక నుంచి ఇద్దరు దొంగలు మోటర్‌సైకిల్‌పై ఆమెను వెంబడించి మెడలోని రెండు తులాల బంగారు గొలుసును అపహరించుకుపోయారు. బాధితురాలు కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకుని గొల్లపాలెం వైపుగా పారిపోయిన దొంగలను వెంబడించినా వారి ఆచూకీ లభించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కరప ఎస్‌ఐ తోట సునీత ఘటనాస్థలికి వెళ్లి విచారించారు. ఎరుపు రంగు గ్లామర్ బండిపై వచ్చిన ఇద్దరు అపరిచిత వ్యక్తులు కొద్దిసేపు అక్కడ చక్కర్లు కొట్టారని, దీంతో అనుమానం వచ్చి వారి బండి నెంబర్‌ను (ఏపీ05 2694) గుర్తుపెట్టుకున్నట్టుగా ప్రత్యక్ష సాక్షి ఒకరు పోలీసులకు తెలిపాడు. కాగా చైన్ స్నాచింగ్ జరిగిన ప్రదేశాన్ని మంగళవారం కాకినాడరూరల్ సీఐ చైతన్యకృష్ణ పరిశీలించి బాధితురాలు, స్థానికులను విచారించారు. స్థానిక రామాలయంలో సీసీ టీవీ పుటేజీని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సునీత తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని తండ్రి మృతి

కుమారులకు గాయాలు



ట్రాక్టర్ కింద రాజులు నాయుడు మృతదేహం

కోటనందూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని తండ్రి మృతిచెందగా కుమారులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా తుని మండలం కుమ్మరిలోవకు చెందిన గేదేల రాజులునాయుడు(35) తన కుమారులతో కలిసి మంగళవారం నాతవరం మండలం బుచ్చంపేటలో నూకాలమ్మగుడి వెళ్తున్నారు. కోటనందూరు మండలం కాకరపల్లి శివారు తమ్మిచెరువు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో రాజులునాయుడు అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారులకు గాయాలుకాగా కోటనందూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించారు. ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడని, కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

'పుట్టుకతో వచ్చే వంకర పాదాల పట్ల నిర్లక్ష్యం వద్దు'



సదస్సులో కేక్ కట్ చేస్తున్న డాక్టర్ విఠల్

జీజీహెచ్(కాకినాడ) జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతో వచ్చే వంకర పాదాలు (క్లబ్‌ఫుట్) పట్ల నిర్లక్ష్యం తగదని కాకినాడ జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్, ఆర్థో విభాగాధిపతి డాక్టర్ ఎంపీఆర్ విఠల్ సూచించారు. వరల్డ్ క్లబ్‌ఫుట్ డే కార్యక్రమంలో భాగంగా డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ (డీఈఐసీ) క్యూర్ ఇండియా, జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఆర్థో లెక్చర్ గ్యాలరీలో మంగళవారం అవగాహనా సదస్సును నిర్వహించారు. విఠల్ మాట్లాడుతూ పుట్టుకతో వచ్చే వంకర పాదాలు కలిగిన చిన్నారులను తల్లిదండ్రులు గుర్తించిన వెంటనే 21 రోజుల్లోపు జిల్లాలోని నేషనల్ హెల్త్ మిషన్ నందుగల రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా పని చేస్తున్న డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ (డీఈఐసీ)కి రిఫర్ చేయాల్సిందిగా సూచించారు. అలా రిఫర్ చేస్తే ఆ విభాగానికి చెందిన చిన్న పిల్లల వైద్య నిపుణులు, ఫిజియోథెరపి నిపుణులు తల్లిదండ్రులకు పాటించాల్సిన సలహాలు ఇచ్చి జీజీహెచ్‌లోని ఆర్థో వైద్య నిపుణులతో కాస్టింగ్ పద్ధతి ద్వారా చికిత్స అందించవచ్చన్నారు. అవసరమైతే టినోటమి అనే మైనర్ శస్త్రచికిత్స నిర్వహిస్తారని అనంతరం పరికరాలను క్యూర్ ఇండియా స్వచ్ఛంద సంస్థ అందిస్తుందని, చిన్నారి పూర్తిస్థాయిలో కోలుకునే వరకు ఫిజియోథెరపీని పూర్తిస్థాయిలో ఉచితంగా అందజేస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వి.అరుణ, ఆర్థో ప్రొఫెసర్‌లు డాక్టర్ ముఖర్జీ, డాక్టర్ మధు ఉన్నారు.

ఎగైన్.. ఎండలే!

నిన్నమొన్నటి వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వర్షాలు కురిశాయి. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు. అయితే ఎండల ప్రభావం మళ్లీ ప్రారంభంకావడంతో ప్రజలు అల్లాడుతున్నారు మంగళవారం ఎండధాటికి బెంబేలెత్తిపోయారు.



అమలాపురంలో నిర్మానుష్యంగా గడియారం స్తంభం సెంటర్





కాకినాడలో ఎండ నుంచి రక్షణ కోసం ప్రజల పాట్లు

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 27 మందికి జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ 3వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి మంగళవారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 సీఐలు ఎన్. రమేష్, డి.రామారావు సిబ్బందితో సోమవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ 27 మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. ఒకరికి 5 రోజులు, 9 మందికి 2 రోజులు చొప్పున జైలు శిక్ష, 17 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్టు సీఐ రమేష్ పేర్కొన్నారు.



ముగ్గుల పోటీలు

మలికిపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన సందర్భంగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.6వేలు, మూడో బహుమతి రూ.3 వేలు అందించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

అంతర్వేది, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వీవీమెరకలో ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన కోళ్ల పాపాయ్యను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ నాయకులతో కలిసి మంగళవారం పరామర్శించారు. నాయకులు సమకూర్చిన బియ్యం, నిత్యావసర సరుకులను ఆమెకు అందించారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు పాల్గొన్నారు.

పోషక విలువలతో ఆహారాన్ని అందించాలి

- మిడ్‌డే మీల్స్ జిల్లా ఏడీ సురేష్
- నిర్వాహకులకు శిక్షణ



మాట్లాడుతున్న మిడ్‌డే మీల్స్ ఏడీ సురేష్

ముమ్మిడివరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో పోషక విలువలతో అందించాలని మిడ్‌డే మీల్స్ జిల్లా ఏడీ ఎన్.సురేష్ పేర్కొన్నారు. ముమ్మిడివరం మండలంలోని 80 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి మధ్యాహ్న భోజనం నిర్వహించే కుక్‌లు, హెల్పర్లకు ముమ్మిడివరం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్యాస్‌వల్ల అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇక నుంచి అన్ని పాఠశాలలకు సన్నరకం బియ్యం పంపిణీ అవుతాయని, కొత్త మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని తయారుచేసి విద్యార్థులకు అందించాలన్నారు. ప్రతీ పాఠశాలలో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు రుచిగా, శుచిగా భోజనం అందించాలన్నారు. పరిశుభ్రత, పౌష్టికాహారం గురించి వారికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు డి.గౌరీశంకర్, ఆర్.ఉదయభాస్కర్, ట్రైనర్‌లు పీవీ గోపాల్, సాధనాల సూర్యావతి తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి కోర్స్ డైరెక్టర్‌గా వ్యవహరించిన ఎంఈవో కె.హెలీనా మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. ఆరోగ్య శాఖ సిబ్బంది పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వంటల పోటీలు నిర్వహించి వంటకాలను ప్రదర్శించారు. ఎంఈవో-2 సీహెచ్ వీబీ నందం, స్థానిక జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కె.ఉమాదేవి, సీఆర్‌ఎంటీలు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్, (ఆంధ్రజ్యోతి): అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండలంలోని కుకింగ్ కం హెల్పర్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు శిక్షణకు హాజరుకాగా అసిస్టెంట్ డైరెక్టర్ సురేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వంటచేసే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, మెనూను పాఠశాలలు పునఃప్రారంభం నుంచి అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం మాట్లాడుతూ రుచిగా ఉండేలా వంటలు వండాలని సూచించారు. మండల విద్యాశాఖాధికారిణి సరెళ్ల దుర్గాదేవి, మౌనిక, సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం రామకృష్ణ, వి.వరలక్ష్మి, ఎం.అనూష, వి.సోమేశ్వరరావు పాల్గొన్నారు.

వెన్నుపోటుకు పేటెంట్ హక్కు జగన్‌దే

ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు





అమలాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు, ఐ.పోలవరం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

అమలాపురం టౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వెన్నుపోటుకు పేటెంట్ హక్కు పొందిన ఘనత రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. నాడు వైసీపీ పాలనలో చేసిన కుంభకోణాల నుంచి పరజల దృష్టిని మళ్లించేందుకే జగన్ ముఠా ధర్నాల డ్రామా ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వెన్నుపోటు అంటే ముందుగా ప్రజలకు గుర్తుకు వచ్చేది జగనేనని అన్నారు. అమలాపురంలో మంగళవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు స్వగృహం వద్ద జరిగిన సమావేశంలో ఆనందరావు మాట్లాడుతూ నాడు కాంగ్రెస్‌ను అడ్డం పెట్టుకుని లక్షల కోట్లు దోచుకుని అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి వైసీపీ పార్టీని స్థాపించింది నీవు కాదా అని ప్రశ్నించారు. ఆస్తికోసం తల్లినీ, చెల్లిని ఇంటి నుంచి గెంటేసి చివరకు కుటుంబ వ్యవస్థకే జగన్ వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. మద్యపాన నిషేధంపై మాటతప్పి, మడమ తిప్పిన ఘనత మీది కాదా అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సబ్‌ప్లాన్ నిధులు లక్షల కోట్లు దారి మళ్లించి ఆయా సామాజికవర్గాలకు వెన్నుపోటు పొడిచింది ఎవరో ఎవరిని అడిగినా చెబుతారన్నారు. కూటమి పాలనలో తొలి ఏడాదిలోనే 70 శాతం హామీలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందన్నారు. సమావేశంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, నాయకులు నల్లా స్వామి, తిక్కిరెడ్డి నేతాజీ, బోనం సత్యవరప్రసాద్, గందం శ్రీను, నల్లా సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

నిజమైన వెన్నుపోటుదారుడు జగనే

ఐ.పోలవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు నిజమైన వెన్నుపోటుదారుడు మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డేనని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆరోపించారు. మంగళవారం ఆయన మురమళ్ళలో విలేకరులతో మాట్లాడారు. జూన్ 4న వెన్నుపోటు దినంగా జగన్ పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే 70శాతం హామీలను అమలు చేసిందన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో రూ.200కోట్ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. వైసీపీ పాలనలోని అరాచకాలు ఒక్కొక్కటీ బయట పడుతున్న వేళ ప్రజల దృష్టిని మళ్లించేందుకు జగన్ వెన్నుపోటు డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో సంగాని వెంకటేష్, సాగిరాజు సూరిబాబురాజు, కాకర్లపూడి రాజేష్, పాయసం చిన్ని పాల్గొన్నారు.

జగన్ అరాచక పాలనకు చెక్

దీపావళి, సంక్రాంతిలా జరుపుకోవాలి

పి.గన్నవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆరాచక పాలన సాగించిన వైసీపీ మూకలను రాష్ట్ర ప్రజలు తరిమికొట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం దీపావళి, సంక్రాంతి పండుగలను జరుపుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రజలకు పిలుపు నిచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన శుభతరుణంలో ఉదయం ప్రతి ఇంట ముగ్గులు వేసుకోవాలని, దీపావళి మాదిరిగా ప్రతి ఇంట దీపాలు వెలిగించుకుని టపాసులు కాల్చాలని ఎమ్మెల్యే కూటమి నేతలు, కార్యకర్తలను కోరారు.

ప్రజల దృష్టి మళ్లించడానికే డ్రామాలు

వైసీపీ హయాంలో చేసిన కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిమళ్లించడానికే జగన్ ధర్నాల డ్రామాలు ఆడుతున్నారని టీడీపీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆస్తి కోసం తల్లి, చెల్లెను ఇంటి నుంచి గెంటేసి కుటుంబ వ్యవస్థకే వెన్నుపోటు పొడిచిన జగన్ కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు డొక్కా నాథ్‌బాబు, కో-ఆర్డినేషన్ కమిటీ కో-కన్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ, సంసాని పెద్దిరాజు, శేరు శ్రీను బాబు, గుడాల వెంకట రమణ, మేడిద సాయి బాబు, లంకే చిరంజీవి, నిమ్మకాయల శేషు పాల్గొన్నారు.

ఘనంగా లంకతల్లెమ్మ జాతర.. తీర్థం





లంక తల్లెమ్మ, రావులమ్మ అమ్మవారు

ముమ్మిడివరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం గ్రామదేవత శ్రీలంకతల్లెమ్మ అమ్మవారి జాతర, తీర్థ కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. గత నెల 13న అమ్మవారిని నిలిపి 19వ తేదీ నుంచి 15 రోజుల పాటు వివిధ సామాజికవర్గాల వారు అమ్మవారికి సంబరాలు నిర్వహిస్తూ వచ్చారు. సోమవారం రాత్రి అమ్మవారి జాతర మహోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. బ్యాండుమేళాలు, డప్పు వాయిద్యాలు, గరగ నృత్యాలు, బాణసంచా కాల్పులతో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. మంగళవారం అమ్మవారి తీర్థం ఘనంగా జరిగింది. పుట్టింటి ఆడపడుచులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి చలిమిడి, పానకాలు సమర్పించి నైవేద్యాలు పెట్టుకున్నారు. మద్దింశెట్టి గోవింద మోహన్ ఆర్థిక సహాయంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, నాయకులు చెల్లి అశోక్, ములపర్తి బాలకృష్ణ, దొమ్మేటి రమణకుమార్, విళ్ల వీరాస్వామినాయుడు, జాగు సత్తిబాబు, చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, పెన్మెత్స జగ్గప్పరాజు, పెన్మెత్స చిట్టిరాజు, కాశి బాలమునికుమారి, గోదశి నాగేశ్వరరావు, గణేశుల బ్రహ్మానందం అమ్మవారిని దర్శించుకున్నారు.

మహాలక్ష్మి తీర్థం

ముమ్మిడివరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): క్రాప గ్రామదేవత శ్రీమహాలక్ష్మి అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవం అత్యంత వైభవంగా సాగింది. గత నెల 13వ తేదీన అమ్మవారిని నిలిపి సంబరాలు నిర్వహిస్తూ వచ్చారు. ఆదివారం రాత్రి సంప్రదాయబద్ధంగా కరణంగారి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం రాత్రి అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డప్పుల వాయిద్యాలు, గరగ నృత్యాలు, బాణసంచా కాల్పులతో అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మంగళవారం అమ్మవారి తీర్థ మహోత్సవం నిర్వహించారు. అమ్మవారికి చలిమిడి పానకాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పుట్టింటి ఆడపడుచులు, అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

రావులమ్మ తీర్థం

అంబాజీపేట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు అగ్రహారం గ్రామదేవత శ్రీరావులమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. తీర్థం మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి పూజఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. గ్రామమంతా ఆడపడుచులతో కళకళలాడింది. అమ్మవార్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తీర్థంలో యువకులు, యువతులు సంప్రదాయ దుస్తులతో అలరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

రోడ్డును అభివృద్ధి చేయాలి

జైభీమ్ యువజన సంఘ సభ్యుల వినతి

మామిడికుదురు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గోగన్నమఠం గ్రామంలోని డైలీమార్కెట్ నుంచి తోటమెరక వరకు ఉన్న రోడ్డును అభివృద్ధి చేయాలంటూ జైభీమ్ యువజన సంఘ సభ్యులు వినతి పత్రాన్ని మంగళవారం సర్పంచ్ అల్లు విజయలక్ష్మికి అందజేశారు. ఈరోడ్డు గోతులతో అధ్వానంగా తయారైందని, ఈరోడ్డువేసి 20ఏళ్ల గడిచినా ఎవరూ పట్టించుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో మోకా మధుబాబు, రాజేష్, రాజా, ఏసుబాబు, మల్లికార్జునరావు, జాన్ తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి

ముమ్మిడివరం, జూన్3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పీపుల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విశ్రాంతి ఆంగ్ల ఉపాధ్యాయులు ఎన్.అబ్బులు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని కొనసాగిస్తే భవిష్యత్తు తరాలకు జీవించే వాతావరణం కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కస్నీడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ ఆరోగ్యంపై విపరీతమైన ప్రభావం ఉంటుందన్నారు. ఈసందర్భంగా ప్లాస్టిక్ నియంత్రణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పీపుల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా ప్రసాద్ వ్యవహరించారు.

కథా పఠనం బహుళ ప్రయోజనం

ఉప్పలగుప్తం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కథలు చదవడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరగడమే కాకుండా తెలుగు భాషపై పట్టు సాధించవచ్చని ప్రముఖ సాహితీవేత్త నల్లా నరసింహమూర్తి అన్నారు. భీమనపల్లి గ్రంథాలయంలో మంగళవారం కథలు చదవడం ఎలా అనే అంశంపై కార్యక్రమం జరిగింది. కథలు చదవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. బాలల నీతి కథలను చదివి విన్పించారు. గ్రంథాలయాధికారి నిమ్మకాయల శేషుకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కవి బీవీవీ సత్యనారాయణ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ముగ్గుల పోటీలు

యానాం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పుట్టినరోజును పురస్కరించుకుని మల్లాడి అభిమానసంఘం ఆధ్వర్యంలో వారం రోజులుగా వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం 8గంటల నుంచి స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో మహిళలకు ముగ్గుల పోటీలు, సాయంత్రం మ్యూజికల్ చైర్స్, గురువారం 4కే రన్ నిర్వహించనున్నారు.

బండారులంక చేరుకున్న దివ్య రథయాత్ర



బండారులంకలో శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని దివ్య రథయాత్రలో పాల్గొన్న భక్తులు

అమలాపురం రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయిబాబా శతవర్ష జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రేమే దైవం అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథోత్సవం చేపట్టారు. మంగళవారం యానాం మీదుగా రథోత్సవం వందలాది మంది భక్తుల ఘనస్వాగతంతో బండారులంక చేరుకుంది. స్టేట్ బ్యాంకు కాలనీలోని షిర్డిసాయిబాబా ఆలయం వద్ద నుంచి స్థానిక శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో రథయాత్రను ముందుకు సాగించారు. దారి పొడవునా భక్తి గీతాలు ఆలపించారు. అందరినీ ప్రేమించండి. అందరికీ సేవ చేయండని సత్యసాయి సూక్తులతో ప్లకార్డులు చేతబూని చిన్నచంద్రపురం వరకు రథయాత్రను కొనసాగించారు. స్వామివారికి దారి పొడవునా మంగళహారతులు పట్టారు. సమితి సభ్యులు కొండా కుమార్, కొండా నాగవెంకటబసవరాజు, ఉప్పుగంటి వెంకటేశ్వరరావు, ఊటుకూరి సోమరాజు, కటకం గిరి, దంగేటి అరుణకుమార్, డి.సింహాద్రి, మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, చందన శంకరరావు, బాలవికాస్ విద్యార్థులు, మహిళా విభాగం సభ్యులు వందలాదిగా తదితరులు పాల్గొన్నారు.

దివ్యరథ యాత్రకు ఘనస్వాగతం

అంబాజీపేట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీసత్యసాయి బాబా శత జయంత్యుత్సవాల్లో భాగంగా అంబాజీపేట చేరుకున్న శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథ యాత్రకు ఘనస్వాగతం పలికారు. అంబాజీపేట సత్యసాయి జోన్ భక్తులు ఆధ్వర్యంలో మహిళలు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. స్వామి దివ్యపాదాలను దర్శనం చేసుకున్నారు. రథయాత్ర ప్రధాన రహదారుల మీదుగా స్థానిక పెద్దవీధిలోని శ్యామలాంబ ఆలయం, కనకదుర్గమ్మ ఆలయం మీదుగా సత్యసాయినగర్ వరకూ కొనసాగింది. కార్యక్రమంలో సత్యసాయిబాబా భక్తులు పాల్గొన్నారు.

పల్లిపాలెం జట్టు విజయం

అంతర్వేది, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గొంది గ్రామంలో మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో 12 జట్లు తలపడ్డాయి. అడివిపాలెం-పల్లిపాలెం జట్టు ఫైనల్‌లో తలపడగా పల్లిపాలెం జట్టు విజేతగా నిలిచింది. వారికి సీఐ నవీన్‌నరసింహమూర్తి అంతర్వేది పల్లిపాలెం సీనియర్ బాయ్స్‌కు నగదు, షీల్డులను అందించారు.

ఇంటింటా ప్రచారం

అయినవిల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కొండుకుదురు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులను చేర్చుకునేందుకు ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. మంగళవారం పాఠశాల పూర్వ విద్యార్థి, దాత వజ్రపు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆటో ద్వారా ఇంటింటా ప్రచారంచేసి విద్యార్థులను చేర్చుకున్నారు.పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పి.విశ్వేశ్వరరావు, యాళ్ల ఆనందరావు, కోలా అర్జునరావు, పాఠశాల హెచ్‌ఎం వి.శ్రీహరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు సర్వీసులు

అమలాపురం రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): అరుణాచల గిరి ప్రదక్షిణ యాత్రకు అమలాపురం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. యాత్రలో భాగంగా కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, కంచి, శ్రీకాళహస్తి, విజయవాడ ప్రాంతాల్లోని దేవాలయాల దర్శనం కల్పిస్తారన్నారు. ఈనెల9వ తేదీ సోమవారం అమలాపురం డిపో నుంచి బస్సులు బయలుదేరతాయని, అరుణాచలగిరి ప్రదక్షిణ పూర్తయిన తరువాత 12వ తేదీన తిరిగి ఆ బస్సులు అమలాపురం చేరుకుంటాయన్నారు. సూపర్‌లగ్జరీ బస్సు సర్వీసుకు పెద్దలకు రూ.2950గా టిక్కెట్ ధరను నిర్ణయించామన్నారు. ఆన్‌లైన్‌లో ముందుగా రిజర్వేషన్ చేయించుకునేందుకు సెల్ 9959225576ను సంప్రదించాలని డిపో మేనేజర్ కోరారు.

ఘనంగా ప్రపంచ సైకిల్ దినోత్సవం



ప్రపంచ సైకిల్ యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం కోసం సైకిల్ తొక్కండి.. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ కోసం ప్రతీ ఒక్కరూ సైకిల్ తొక్కాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా హెల్దీ సైక్లింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం మలికిపురంలో పలువురు సైకిల్ తొక్కుతూ ర్యాలీ నిర్వహించారు. వాకర్స్ క్లబ్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ప్రముఖ వైద్యులు జాన వీరభద్రప్రసాద్, కేసీఎంఎల్ శ్రీనివాస్, కేవీఎస్ శ్రీనివాసరావులు సైక్లింగ్ ప్రాముఖ్యతను వివరించారు. దెందుకూరి రాంబాబురాజు, బోనం రాజు, నల్లి మోహనరావు, నక్కా రమేష్, పోలిశెట్టిగణేష్ పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం

అమలాపురం టౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): అమలాపురం వాకర్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో ఆరోగ్యం కోసం సైకిల్ అనే నినాదంతో అమలాపురం గడియారస్తంభం సెంటర్ నుంచి ప్రారంభించిన సైకిల్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ప్రజలు తమ ఆరోగ్యం కోసం ప్రతీరోజు 30నిమిషాల పాటు సైక్లింగ్ చేయాలని సూచించారు. పట్టణ పురవీధుల మీదుగా ప్లకార్డులు చేతబూని సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వాకర్స్ బులిటెన్ ఎడిటర్ పుత్సా కృష్ణకామేశ్వర్, కార్యదర్శి బూరగాయల శివరామకృష్ణ, కోశాధికారి పడాల విశ్వేశ్వరరావునాయుడు, సహకార్యదర్శి కుడుపూడి త్రినాథ్, ఉపాధ్యక్షుడు నూకల సత్యనారాయణ, క్లబ్ డైరెక్టర్ తోట గంగారావు, పట్నాల వెంకటరమణ, గుర్రం రామకృష్ణారావు, పేరి లక్ష్మీనరసింహం, కూచిమంచి కృష్ణ పాల్గొన్నారు.

రైతులు డ్రోన్లపై పరిజ్ఞానం పెంచుకోవాలి

అంబాజీపేట, జూన్3(ఆంధ్రజ్యోతి): వ్యవసాయపనులు కోసం రైతులు డ్రోన్లపై పరిజ్ఞానం పెంచుకోవాలని కేంద్ర వాణిజ్య వ్యవసాయ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.రాజశేఖర్ అన్నారు. ముక్కామల రైతు సేవా కేంద్రంవద్ద వికసిత్ కృషి సంకల్ప అభియాన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలు, పంటల సాగు, సస్యరక్షణ చర్యలపై రైతులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ వ్యవసాయ డ్రోన్లకు 80శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ సంజయ్ హెగ్డే, డాక్టర్ మాధవన్, జిల్లా వనరుల కేంద్రసహాయ వ్యవసాయ సంచాలకులు ఎ.రాజశేఖర్ పాల్గొన్నారు. ఏవో సీహెచ్‌డీ విజయకుమార్, ఉద్యాన శాఖాధికారి ఎం.శైలజా, సర్పంచ్ జల్లి బాలరాజు, రైతులు బండారు మల్లిబాబు, మానేపల్లి శ్రీను, కొప్పిశెట్టి సత్య, వీఏఏ, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం భరోసా: ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న ప్రతీ కుంటుంబాన్ని కూటమి ప్రభుత్వం ఆదుకుంటోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఇటీవల నాగుల్లంక గ్రామానికి చెందిన సానబోయిన సూర్యతేజ, కేతా ప్రవీణ్, పశ్చిమ గోదావరి జిల్లాకు నీతిపూడి పౌల్‌కుమార్ రాయిలంక వశిష్ఠ గోదావరి నదిలో గల్లంతై మృతిచెందిన విషయం విదితమే. స్థానిక జనసేన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.2 లక్షలు చొప్పున చెక్కులను సూర్యతేజ,ప్రవీణ్ కుటుంబాలకు స్థానిక కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే అందించారు. టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, సర్పంచ్ యల్లమిల్లి కృష్ణవేణి, నీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉపాధ్యక్షుడు చొల్లంగి సత్యనారాయణ మూర్తి, సంసాని పెద్దిరాజు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, ఆదిమూలం సూరయ్యకాపు, తాటికాయల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ

ఐ.పోలవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కమిని వద్ద గోదావరిలో ఇటీవల వడ్డి మహేష్, రాజేష్ గల్లంతై మృతి చెందిన విషయం విదితమే. మంగళవారం ఎర్రగరువుకు చెందిన వడ్డి మహేష్, రాజేష్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.2లక్షల వంతున ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పరిహారం అందించారు. కార్యక్రమంలో నాగిడి నాగేశ్వరరావు, కాకర్లపూడి రాజేష్, సర్పంచ్ మందపాటి జయలక్ష్మీభైరవస్వామి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, కూటమి నేతలకు ఘన సన్మానం



పి.గన్నవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నగరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, డైరెక్టర్లు మంగళవారం ఎమ్మెల్యే, కూటమి నేతలను సన్మానించారు. స్థానిక జనసేన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, టీడీపీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, టీడీపీ రాష్ట్ర నాయకుడు సంసాని పెద్దిరాజులను మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గుడాల వెంకటరమణ, డైరెక్టర్లు నూకల విశ్వేశ్వరరావు, లూటుకుర్తి సత్యనారాయణ, లంకే చిరంజీవి, నిమ్మకాయల శేషులను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

సత్తెమ్మతల్లిని దర్శించుకున్న దేవ

అంతర్వేది, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వీవీమెరక గ్రామం తోట, ఉంగరాల వారి మెరక శేషారాయుడు కాల్వగట్టు వద్ద వెలసి ఉన్న శ్రీసత్తెమ్మతల్లి అమ్మవార్ని జాతర మహోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ఆడపడుచులు అమ్మవారికి కుంకుమ పూజచేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు స్థానికులు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, ఉండపల్లి అంజి, మేడిచర్ల సత్యవాణి, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

గజమాల యాత్రను విజయవంతం చేయాలి

మామిడికుదురు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ ఆలయ వ్యవస్థాపక నిర్మాత మొల్లేటి రామస్వామికి అలంకరించే గజమాల యాత్రను విజయవంతం చేయాలని రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు దొమ్మేటి ఉమామహేశ్వరరావు కోరారు. ఈనెల6న స్వామివారి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ నిర్మాత రామస్వామి మెడలో భారీ గజమాలను అలంకరించడానికి తాటిపాక శెట్టిబలిజ సామాజిక భవనం నుంచి అప్పనపల్లి వరకు ఊరేగింపు జరుగుతుందని తెలిపారు. యాత్రకు అధిక సంఖ్యలో సంఘీయులు, రామస్వామి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గుబ్బల బాబ్జి, చెల్లుబోయిన శ్రీనివాస్, కడలి నూకరాజు, గుబ్బల శ్రీను, కాండ్రేగుల శ్రీను, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): మామిడికుదురు మండలం అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామివారి ఆలయ నిర్మాత మొల్లేటి రామస్వామి-ఆదిలక్ష్మి దంపతులకు ఈనెల6న కల్యాణోత్సవాల్లో భాగంగా సమర్పించే గజమాల యాత్రను విజయవంతం చేయాలని రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. తాటిపాకలో రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమసంఘ భవన కార్యాలయంలో మంగళవారం సంఘ అధ్యక్షుడు దమ్మేటి ఉమామహేశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. గజమాల యాత్రలో శెట్టిబలిజ సోదరులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తొలుత గజమాల యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. కాండ్రేగుల సత్యనారాయణమూర్తి, గుబ్బల శ్రీనివాస్, చెల్లుబోయిన శ్రీనివాస్, గుబ్బల బాబ్జి, గుబ్బల రమేష్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపు

రాజోలు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో చేసిన సేవలే ఉద్యోగులకు తగిన గుర్తింపునిస్తాయని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శివకోటిలో శ్రీమంగెన గంగయ్య కాపు కల్యాణ మండపంలో దివాకర్ అధ్యక్షతన ఉద్యోగ విరమణ చేసిన తహశీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ తహశీల్దార్‌గా ప్రసాద్ ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. మరో ముఖ్యఅతిథి అమలాపురం ఆర్డీవో కె.మాధవి మాట్లాడుతూ తహశీల్దార్ ప్రసాద్ విధి నిర్వహణలో సమర్థవంతంగా పనిచేశారన్నారు. అనంతరం విశ్రాంత తహశీల్దార్ ప్రసాద్ దంపతులను జ్ఞాపిక అందజేసి దుశ్శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జి తహశీల్దార్ పీఎస్ రాజు, చాగంటి స్వామి, గుండుబోగుల పెద్దకాపు, పినిశెట్టి బుజ్జి, దిరిశాల బాలాజీ, కసుకుర్తి త్రినాథస్వామి, అడబాల చంటి, సర్పంచ్‌లు బడుగు శ్రీనివాసరావు, నక్కా రామారావు, రేవు జ్యోతి, వైస్‌ఎంపీపీ పోలమూరి శ్యామ్‌బాబు, సూరిశెట్టి శ్రీనివాస్, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

రాజోలు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాజోలు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి వచ్చే పేద రోగులకు ఆసుపత్రి సిబ్బంది మంచి వైద్యాన్ని అందించాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సూచించారు. మంగళవారం రాజోలు సామాజిక ఆసుపత్రిలో అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఆసుపత్రికి గైనకాలజిస్టును నియమిస్తామన్నారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై సమావేశంలో సూపరింటెండెంట్‌తో చర్చించారు. మటపర్తి లక్ష్మి, పితాని శ్రీనివాసరావు, అన్నపూర్ణ, సూరిశెట్టి శ్రీనివాస్, కాట్నం రాజు, దిరిశాల బాలాజీ, అడబాల విజయ్‌చ ఉండపల్లి అంజి, కోళ్ల బాబి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అంతర్గత రోడ్ల అభివృద్ధి



అమలాపురం టౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణంలోని సమస్యకు చెక్ పెట్టేందుకు ముందస్తు వ్యూహంతో అంతర్గత రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించినట్టు ఎమ్మెల్యే ఆయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. దీనిలో భాగంగా అమలాపురం పట్టణానికి అనుసంధానంగా ఉన్న బైపాస్ రోడ్లకు కలిపే విధంగా అంతర్గత రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. మంగళవారం ఈదరపల్లి బైపాస్ రోడ్డుకు అనుసంధానంగా ఉన్న అంతర్గత రోడ్ల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, అధికారి బాబ్జి, దున్నాల దుర్గ, సూదా చిన్నా, జంపన సుమన్‌వర్మ, అంబికా రాంబాబు, గొర్తి పవన్, ఏడిద దొరబాబు, రవణం నరసింహారావు, ఆకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం అమ్మకాలు సాగిస్తున్న వ్యక్తి బైండోవర్

అమలాపురం రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తాండవపల్లి గ్రామంలో మద్యం విక్రయాలు సాగిస్తున్న కందికట్ల శివకుమార్ అలియాస్ రాజును మంగళవారం అమలాపురం తహశీల్దార్ కోర్టులో బైండోవర్ చేసినట్టు ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. శివశంకర్‌కు రూ.లక్ష ష్యూరిటీని తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ విధించినట్టు సీఐ తెలిపారు.

కారు డ్రైవర్ అరెస్టు

అమలాపురం టౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మితిమీరిన వేగంతో కారు నడిపి మోటారుసైకిల్‌ను ఢీకొన్న ఘటనలో కారు డ్రైవర్ వడ్డి దీపక్‌ను మంగళవారం అరెస్టుచేసినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. అమలాపురం ఎర్రవంతెన వద్ద సోమవారం రాత్రి మోటారుసైకిల్‌పై వెళుతున్న ఇద్దరు వ్యక్తులను ఎదురుగా వేగంగా వచ్చి కారుతో ఢీకొట్టిన ఘటనలో మోటారు సైకిలిస్టులు గాయపడ్డారు. దీపక్‌ను అరెస్టుచేసినట్టు సీఐ తెలిపారు.

అమలాపురంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుచేయాలి

అమలాపురం టౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అమలాపురంలో పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థుల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మంగళవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు, ఉన్నత విద్య అధికారులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి వినతిపత్రాలను అందజేశారు. అమలాపురం పట్టణ పరిసర మండలాలకు చెందిన విద్యార్థులు డిగ్రీ విద్యను అభ్యసించేందుకు ప్రైవేటు పాఠశాలలపై ఆధారపడాల్సి వస్తుందని, ఫీజుల భారంతో ఎందరో ఉన్నత విద్యకు దూరమవుతున్నారని వివరించారు. 2021 వరకు అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాల ఎయిడెడ్ డిగ్రీ కళాశాలగా ఉండేదని, ఆ తరువాత వైసీపీ ప్రభుత్వ తీరుతో ప్రైవేటు డిగ్రీ కళాశాలగా మారిపోయిందన్నారు. జిల్లా కేంద్రంలో పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

గుమ్మిలేరు-పినపళ్ల లింక్ రోడ్డుకు నిధులు మంజూరు


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజు

ఆలమూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల మధ్య ఉన్న లింక్ రోడ్లను జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి చేయాలని ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా గుమ్మిలేరు-పినపళ్ల లింక్ రోడ్డుకు నిధులు మంజూరు చేశారు. ఈ రోడ్డు అభివృద్ధికి ఎన్‌ఆర్‌జీఎస్ ద్వారా రూ.కోటి 20లక్షల నిధులు కేటాయించడంతో దీన్ని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయడానికి పనులు ప్రారంభించారు. ఈ రోడ్డు అభివృద్ధికి ఉన్న కొద్దిపాటి అడ్డంకులను దాటుకుని ఆయా పనులు ముందుకు సాగుతోంది. మంగళవారం ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు వాటిని పరిశీలించి స్థానిక కాంట్రాక్టర్‌తో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకం పనులు సక్రమంగా నిర్వహించడంతోపాటు నాణ్యత విషయంలో రాజీ పడకుండా వీటి పనులు జరగాలని ఆయన సూచించారు.


పసలపూడిలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

హెల్మెట్ వాడకంపై వాహనదారులకు అవగాహన

రాయవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి గ్రామంలో మంగళవారం పలువురు వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంతో రోడ్డు ప్రమాదంలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. హెల్మెట్ వల్ల ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చన్నారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని వాహన రికార్డులు సక్రమంగా ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల కలిగే నష్టాలను తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ డి.సురేష్ బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెనికేరులో పశువులశాల దగ్ధం

ఆలమూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం పెనికేరులో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పశువులశాల పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రెండు పాడి పశువులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెనికేరు గ్రామానికి చెందిన రైతు గోపు శ్రీనుకు చెందిన పశువులశాలలో అయిదు పాడి పశువులు ఉండగా, మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించిందన్నారు. ఈ ప్రమాదంలో మూడు పాడి పశువులను స్థానికులు రక్షించినప్పటికీ రెండు పాడి పశువులకు గాయలైనట్టు వారు తెలి పారు. గాయపడిన పశువులకు పెనికేరు పశువైద్యాధికారి భానుప్రసాద్ వైద్యం అందించినట్టు తెలిపారు. ఈ ప్రమాదంలో పశువులశాలతోపాటు గడ్డివాము దగ్ధమైందన్నారు. ఈ ప్రమాదంలో ఆస్తినష్టం రూ.లక్షల్లో ఉంటుందని రైతు శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు.


పెనికేరులో దగ్ధమైన పశువులశాల


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ. 3.14 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తజనం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,14,509 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి ఐ.పోలవరం మండలం కేశనకుర్రుకు చెందిన పిన్నమరాజు సత్యనారాయణరాజు కుటుంబ సభ్యులు రూ.51,111 విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం అందచేశారు.

వెన్నుపోటు దినం పోస్టర్‌పై కూటమి నాయకుల ఫిర్యాదు

ద్రాక్షారామ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం పోస్టర్‌పై మంగళవారం కూటమి నాయకులు ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ద్రాక్షారామ మెయిన్ రోడ్డులో 4న వెన్నుపోటు దినం అని పేర్కొంటూ వైసీపీ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్‌డీఏ నాయకులు, ప్రజల మనోభావాలు దెబ్బతినేలా వారు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని ఫిర్యాదు చేశారు. టీడీపీ నాయకులు డాక్టర్ మడకా రాంబాబు, టేకుమూడి సత్యనారాయణ, పి.సాంబశివరావు, జనసేన నాయకులు సంపతి సత్యనారాయణ, నామా వెంకన్నబాబు, చోడిశెట్టి శివాజీ, ముప్పనపల్లి గణేష్ తదితరులు ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్‌కు ఫిర్యాదు అందజేశారు.


వెన్నుపోటు దినం పోస్టర్‌పై ఎస్ఐ లక్ష్మణ్‌కు ఫిర్యాదు చేస్తున్న కూటమి నాయకులు

వైసీపీ నాయకులపై ఫిర్యాదు

రామచంద్రపురం(ద్రాక్షారామ): వైసీపీ నాయకులు ఏర్పాటు చేసిన వెన్నుపోటు దినం ఫ్లెక్సీపై రామచంద్రపురం పోలీసులకు మంగళవారం కూటమి నాయకులు ఫిర్యాదు చేశారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, మాజీ కౌన్సిలరు అల్లం శ్రీనివాస్, కంచుమర్తి బాబూరావు, కొత్తపల్లి శ్రీను, కవల నానాజీ, బళ్ల శివరామకృష్ణ, వంశీ, మురళీ, మసేను తదితరులు ఫిర్యాదు చేశారు. ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని, వాటిని ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రహదారి ఇలా ఉంటే...వెళ్లేదెలా?

కె.గంగవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి గ్రామం నుంచి బీసీ కాలనీకి వెళ్లే పంచాయతీరాజ్ రహదారి అధ్వానంగా మారింది. ఊడిమూడి, సుందరపల్లి, కోట గ్రామాల నుంచి కోటిపల్లి వెళ్లే ప్రజలు ఈ రహదారిని ఉపయోగించుకుంటారు. కోటిపల్లి బీసీ కాలనీకి వెళ్లే ప్రజలు ఈ రహదారి గుండానే వారి కాలనీకి చేరుకోవాల్సి ఉంటుంది. గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా రహదారిని నిర్లక్ష్యం చేయడంతో ప్రస్తుతం రహదారి గోతులు ఏర్పడి అధ్వానంగా మారింది. కూటమి ప్రభుత్వం పల్లె పండుగ పేరున అనేక రహదారులు అభివృద్ధి చేస్తున్నది. ఇటీవల పంచాయతీరాజ్ శాఖ రహదారుల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించిన నేపథ్యంలో తమ రహదారిని అభివృద్ధి చేయాలని స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.


కోటిపల్లి నుంచి బీసీ కాలనీలోకి వెళ్లే రహదారి

వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్ వైఎస్ జగన్

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు



మండపేట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లవైసీపీ రాక్షస పాలనకు ప్రజలు ఓటు ద్వారా బుద్ధిచెప్పి కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టిన రోజు జూన్ 4 అని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. పార్టీ కార్యాలయం నుంచి మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌కు బుద్ధి చెప్పిన ప్రజలు వెన్నుపోటుదారులా? అని ఆయన ప్రశ్నించారు. హత్యా రాజకీయాలు, కుటుంబ సభ్యులకు వెన్నుపోటు పొడిచిన చరిత్ర జగన్‌దని ఆయన ధ్వజమెత్తారు. బాబాయ్‌కి గొడ్డలిపోటు, తల్లి,చెల్లిని దూరంపెట్టిన ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ప్రజలు జగన్‌కు బుద్ధి చెప్పినా ఇప్పటికీ జ్ఞానోదయం కలగకపోవటం విచారకరమన్నారు. వైసీపీ తలపెట్టిన వెన్నుపోటు దినాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల ఖండించారు.

వెన్నుపోటు..గొడ్డలివేటుపై జగన్ మాట్లాడటమా..?

తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి మమత ధ్వజం



ఆలమూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వెన్నుపోటు.. గొడ్డలివేటుపై వైసీపీ అధినేత జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ జడ్పీటీసీ దండంగి మమత ధ్వజమెత్తారు. వైసీపీ పాలన విధ్వంసంతో మొదలైతే, నేటి కూటమి పాలన అభివృద్ధి కార్యక్రమాలతో మొదలైందన్నారు. చింతలూరులో మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి తొలి ఏడాది పాలనలో 10శాతం హామీలను కూడా అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.వెయ్యి పింఛన్ పెంచిన ఘనత దక్కించుకుందన్నారు. ఐదేళ్లలో వెయ్యి పెంచిన మీరు వెన్నుపోటు గురించి మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించారు.

వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్ వైఎస్ జగన్: కాంగ్రెసు ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని లక్షల కోట్లు దోచుకున్న జగన్ ఆ పార్టీని వెన్నుపోటు పొడిచిన సంగతి ఆయన మరిచారా? అని మమత ప్రశ్నించారు. తెలంగాణకు చెందిన బీసీ నాయకుడు శివకుమార్ వైసీపీని స్థాపిస్తే ఆపార్టీని కబ్జా చేసిన సంగతి మరిచారా? అని ప్రశ్నించారు. సొంత బాబాయ్‌ను గొడ్డలివేటుతో చంపిన కిరాతకులను కాపాడుతూ రక్త సంబంధాన్ని వెన్నుపోటు పొడిచింది ఎవరో ప్రజలు మరచిపోలేదని మమత అన్నారు. ఆస్తికోసం సొంత వారికే వెన్నుపోటు పొడిచిన నాయకులు మీరు కాదా అని మమత ప్రశ్నించారు.

సభను విజయవంతం చేయాలి

రాయవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): అఖిల భారత దివ్యాంగ హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు పర్యటనను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి ఖండవిల్లి భరత్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం వెంటూరు గ్రామంలో భరత్ కుమార్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం, రామచంద్రపురం, కాకినాడ తదితర ప్రాంతాల్లో జరిగే సమావేశాలను విజయవంతం చేయాలని ఆయన అన్నారు.

వక్ఫ్ చట్టం పుస్తకావిష్కరణ

మండపేట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగ పాడి పరిశ్రమకు చేయూతనిస్తుందని జమాతే ఇస్లామి రాష్ట్ర అధ్యక్షుడు మొహ్మద్ రఫీఖ్ అన్నారు. గాంధీనగర్‌లో వున్న జమీయా మసీదులో మంగళవారం నిర్వహించిన ధార్మిక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వక్ఫ్ చట్టం ఎవరికి లాభం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో జమాతే జిల్లా అధ్యక్షుడు పారుఖ్‌ఆలీ, జిల్లా అధ్యక్షుడు అబుల్ అల్ అలా, మసీద్ అధ్యక్షుడు రహీం, జామియా మసీదు సభ్యులు ఖరీం, సయ్యద్ ఇబ్రహీం, షరీఫ్, ఖరీం తదితరులు పాల్గొన్నారు,


కిశోరి బాలికల భవిష్యత్ ప్రణాళికపై మాట్లాడుతున్న అధికారులు

కిశోరి వికాశానికి వేసవి శిక్షణ కార్యక్రమాలు దోహదం

రావులపాలెం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కిశోరి వికాసానికి వేసవి శిక్షణ కార్యక్రమాలు దోహదం చేస్తాయని యూనిసెఫ్ ప్రతినిధి మేరిజోన్స్, మహిళా శిశుసంక్షేమ అధికారి బి.శాంతి అన్నారు. రావులపాలెం మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో కొత్తపేట సీడీపీవో ఎ.గజలక్ష్మి అధ్యక్షతన కిశోరి బాలికల సాధికారిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మేరిజోన్స్, బి.శాంతి పలు అంశాలపై అవగాహన కల్పించారు.

జాబ్‌మేళాలో 10 మంది ఎంపిక

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 3(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ఉపాధి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 10 మంది ఎంపికయ్యారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఎంపికైన పలువురు అభ్యర్థులకు నియామక పత్రాలను కంపెనీ ప్రతినిధులు అందచేశారు.

యోగాంధ్రను విజయవంతం చేయండి

ద్రాక్షారామ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్డీవో దేవరకొండ అఖిల కోరారు. ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో 9న నిర్వహించనున్న యోగాసనాల గ్రాండ్ ఈవెంట్ ఏర్పాట్లను ఆర్డీవో అధికారులతో కలసి పరిశీలించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 21న విశాఖలో నిర్వహించనున్న యోగా దినోత్సవంలో ప్రధాని మోడీ పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమీషనరు అల్లు వెంకట దుర్గాభవానీ, ఆలయ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో యోగాంధ్ర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో అఖిల. పక్క చిత్రంలో రాయవరంలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో కీర్తి స్పందన

ప్రజలకు అవగాహన కల్పించాలి

రాయవరం, (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన తెలిపారు. మంగళవారం రాయవరం మండల ప్రజా పరిషత్ ప్రాంగణంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో యోగా ప్రాముఖ్యత తెలిపారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు, కూటమి నాయకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పసలపూడిలో: మండలంలోని పసలపూడి గ్రామంలో మాచవరం సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ యోగాపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించి యోగాసనాలు చేయించారు. అనంతరం కిశోరి బాలికలకు వేసవి శిక్షణలో భాగంగా నాయకత్వం, సాధికారిత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.


పెదపళ్ల పీహెచ్‌సీలో ఆశావర్కర్లకు చీరలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి అనంతరామకృష్ణ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆలమూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి బి.అనంతరామకృష్ణ సూచించారు. పెదపళ్ల పీహెచ్‌సీలో మంగళవారం ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో గత నెలరోజులు ఆశావర్కర్లు చేపట్టిన కార్యక్రమాలను తెలిపారు. వర్షాలుపడే సమయంలో వచ్చే వ్యాధుల తీవ్రత అధికంగా ఉంటుందని అవి ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆశావర్కర్లకు ప్రభుత్వం నుంచి వచ్చిన చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రాజా అక్కుల, సీహెచ్‌వో ఎంఎస్ఎన్ రెడ్డి, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ఉమ, పలువురు వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఎమ్మెల్సీ ఆగ్రహం

మండపేట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండపేట మండల సమావేశం మంగళవారం వాడివేడిగా జరిగింది. ఎంపీపీ ఉండమట్ల వాసు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలస్థాయి అధికారుల తీరుపై ఆయన మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల జాప్యంపై అధికారులను ఆయన నిలదీశారు. మండల వ్యవసాయ అధికారి యేసుబాబు వ్యవసాయశాఖ ప్రగతి రైతులకు అందించే పథకాలను వివరించారు. రబీలో రైతులు పండించిన ధాన్యాన్ని 50 శాతం మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసిందని కేశవరం ఎంపీటీసీ అన్నందేవుల కృష్ణ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మండల విద్యాధికారి చింతా సోమిరెడ్డి మాట్లాడుతూ 12న పాఠశాలలు తెరుచుకుంటున్నాయని, ఇప్పటికే పాఠ్య పుస్తకాలు చేరాయన్నారు. కేశవరంలో జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రహరీ నిర్మాణం కోసం కలెక్టర్, విద్యాశాఖాధికారికి నివేదించామని ఎంఈవో తెలిపారు. సమావేశంలో పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతోపాటు ఎంపీడీవో సత్యనారాయణ, పరిపాలనాధికారి ప్రసాద్, ఏఈ నాగేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో దాసరి శ్రీను, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికులతో పనిచేయిస్తే చర్యలు

మండపేట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వ్యాపార సంస్థలు, పరిశ్రమల్లో బాల కార్మికులతో పనిచేయిస్తే శిక్ష తప్పదని మండపేట కార్మికశాఖ సహాయ అధికారి కాశి శివనాగమల్లేశ్వరరావు హెచ్చరించారు. మండలంలో మంగళవారం బాలకార్మికులను గుర్తించే బృందం ఆయన సారధ్యంలో పర్యటించింది. కార్మిక, విద్యాశాఖతో పాటు, ఎన్‌జీవోలకు చెందిన ప్రతినిధులు పలు ప్రాంతాల్లో పర్యటించారు. బాల కార్మికులను పనుల్లో పెట్టుకోవద్దని అధికారులు బృందం ఆయా యాజమాన్యాలను హెచ్చరించింది. కార్యక్రమంలో విద్యాశాఖ సీఆర్‌పీ శేషగిరిరావు, ఎఎస్ఐ శేషగిరిరావు, ఎన్‌జీవో జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు,

ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ఆత్రేయపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు ప్రబలకుండా నివారించుకోవచ్చునని జిల్లా మలేరియా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆత్రేయపురం పీహెచ్‌సీలో నిర్వహించిన మలేరియా నివారణ మాసోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. మలేరియా అంతం మనతోనే అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు బి.సౌమ్య, హైమశ్రీ, సీహెచ్‌వో అరుణకుమారి, సూపర్‌వైజర్లు సూర్యనారాయణ, విజయభాను తదితరులు పాల్గొన్నారు.


మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీలో పాల్గొన్న మలేరియా జిల్లా అధికారి

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ


పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనపరచిన క్రీడాకారులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో జరిగిన 12వ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రామచంద్రపురం ఐ ఫిట్నెస్ జిమ్ క్రీడాకారులు ప్రతిభ కనపరచి పతకాలు గెలుచుకున్నారు. మే 31 నుంచి జూన్ 2 వరకు జరిగిన పోటీలలో ఎస్.కృష్ణవీర్ 120 కిలోల విభాగంలో స్వర్ణ పతకం, 83 కిలోల విభాగంలో కె.బాలకిషోర్ కాంస్య పతకం, ఎం.స్వామినాయుడు రజతం సాధించినట్లు జిమ్ నిర్వాహకులు తెలిపారు. 84 కిలోల ఉమెన్స్ విభాగంలో డి.అఖిలాదేవి రజిత పతకం సాధించింది. 74 కిలోల జూనియర్స్ కేటగిరీలో కె.హర్షవర్ధన్ రజితం, 74 కిలోల సీనియర్స్ విభాగంలో పి.జోసఫ్ కాంస్య పతకం సాధించినట్లు కోచ్ తెలిపారు.

ఆదర్శ ఉద్యోగులకు అభినందనలు

రావులపాలెం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఆర్‌టీసీ డిపోలో పనిచేస్తున్న ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. డిపో మేనేజర్ జీవీవీ రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి డీపీటీవో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధిక ఆదాయం సాధించిన డిపోల్లో రావులపాలెం డిపో ఒకటన్నారు. ఈ డిపో కోనసీమ జిల్లాలో మొదటిస్థానంలో ఉందన్నారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన డిపో మేనేజర్‌కు మేనేజింగ్ డైరెక్టర్ పంపిన ప్రశంసాపత్రాన్ని అందజేశారు. జోన్-2 ఈడీ విజయరత్నం పంపిన ప్రశంసా పత్రాలను అసిస్టెంట్ మేనేజర్ అచ్యుతాంబ, ఏఎంఎఫ్ రాజు, ఎస్ఎం మైగాపుల గురవయ్య నాయుడులకు, ఉత్తమ ప్రతిభ కనబర్చిన డ్రైవర్లకు, కండక్టర్లకు అందజేశారు.

స్టాక్ పాయింట్ తనిఖీ

కపిలేశ్వరపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర జడ్పీ ఉన్నత పాఠశాలలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిడ్స్ స్టాక్ పాయింట్‌ను మంగళవారం సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్స్ ఐఈడీ కోఆర్డినేటర్ సత్యనారాయణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠ్య పుస్తకాలు, బెల్ట్‌లు, డిక్షనరీస్‌లను పరిశీలించి వాటికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం క్వాలిటీ వాల్, రికార్డులను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఎంఆర్సీ సిబ్బంది, పీటీఐలు పాల్గొన్నారు.

ఇరువర్గాల కొట్లాటలో కేసు నమోదు

ఆత్రేయపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని ఇరువర్గాలు కొట్లాటకు పాల్పడిన ఘటనపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొబ్బర్లంక గ్రామంలో వేర్వేరు పార్టీలకు చెందిన జల్లి రాజేంద్ర, గోళ్ళ శ్రీకాంత్ వర్గీయులు పాతకక్షలను పురస్కరించుకుని సోమవారం రాత్రి ఘర్షణకు దిగారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కొట్లాటకు దిగడంతో పలువురు గాయపడ్డారు. ఇరువర్గాల ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

6న జాబ్‌మేళా

మండపేట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 6న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు నేతృత్వంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మెగా జాబ్‌మేళా నిర్వహిస్తోందన్నారు. జాబ్‌మేళాలో ఐటీఐ పాలిటెక్నిక్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. నియోజకవర్గ పరిధిలో గల నిరుద్యోగులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


జొన్నాడ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న జిల్లా రవాణా అధికారి శ్రీనివాసరావు

రోడ్డు నియమాలు పాటించాలి

ఆలమూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వాహనదారులు రహదారి భద్రతా నియమాలు పాటించాలని అంబేడ్కర్ కోనసీమ జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జొన్నాడ సెంటర్‌లో మంగళవారం ఆయన ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 40 వాహనాలపై కేసులు నమోదు చేసి తొమ్మిది వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో మోటారు వాహనాల తనిఖీ అధికారులు లక్ష్మీదేవి, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.


క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ

కపిలేశ్వరపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి రత్నకుమారి ఆధ్వర్యంలో మంగళవారం క్షయవ్యాధిపై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీబీ ఫ్రీ ఇండియాపై ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ ఈనెల 2 నుంచి నెలాఖరు వరకు ప్రతి గ్రామంలో టీబీ ముక్త భారత్ అభియాన్‌పై అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో జె.మల్లిఖార్జునుడు, హెచ్‌ఈ బి.రామారావు, ఎస్‌టీఎస్ రమణ, ఎంఎల్‌హెచ్‌పిలు మనూషా, దివ్య, మహిళా ఆరోగ్య కార్యకర్తలు ఝాన్సీ, శిరోమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్నరకం బియ్యంతో మధ్యాహ్న భోజనం

కపిలేశ్వరపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు సన్నరకం బియ్యం పంపిణీ చేస్తారని ఎంఈవో కె.తాతారావు నిర్వాహకులకు తెలిపారు. మంగళవారం కపిలేశ్వరపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు పాఠశాలల్లో భోజనం అందిస్తున్న కుక్‌ కం హెల్పర్లకు నిర్వహించిన ఒకరోజు శిక్షణలో ఆయన మాట్లాడారు. జిల్లా నుంచి శిక్షణ పొందిన సీహెచ్ చెల్లమ్మ ఈ శిక్షణలో ఆర్పీగా వ్యవహరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ సత్యనారాయణ, పాఠశాల హెచ్‌ఎం, మండల సిబ్బంది, పాఠశాలల ఎండీఎంలు పాల్గొన్నారు.